CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 10 పేజీలు : 8+8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 22 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 10 PAGES : 8+8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 22 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# సీఎం రేవంత్ రెడ్డికి నన్ను అరెస్ట్ చేసే ధైర్యం లేదు

- ఈ-కార్ రేసు కేసులో లై డిటెక్టర్ టెస్టుకు తాను సిద్ధమన్న కేటీఆర్
- కడియంను కాపాడేందుకే దానం నాగేందర్ తో రాజీనామా చేయించే ప్రయత్నం అని ఆరోపణ
- అనర్హత వేటు తప్పించుకునేందుకే ప్రభుత్వం ఎత్తుగడ అని విమర్శలు
- ముందు జీహెచ్ఎంసీ ఎన్నికలు, తర్వాతే ఉపఎన్నికలు అని జోస్యం



**హైదరాబాద్ పెన్ పవర్:**సీఎం రేవంత్ రెడ్డికి తనను అరెస్ట్ చేసే ధైర్యం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వంపై, కాంగ్రెస్ నేతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈ-కార్ రేసు కేసులో ఏమీ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. నేను ఏ తప్పూ చేయలేదు. అందుకే లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధంగా ఉన్నా" అని కేటీఆర్ స్పష్టం చేశారు.పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరిని కాపాడేందుకే దానం నాగేందర్‌తో రాజీనామా చేయించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒకవేళ స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తే ప్రభుత్వం పరువు పోతుందని, ఆ ముప్పు నుంచి తప్పించుకోవడానికే కాంగ్రెస్ ఈ రాజీనామా డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. ముందుగా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ఉపఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు.రాష్ట్రంలో ముందుగా జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తాయని, ఆ తర్వాతే ఉపఎన్నికలు జరుగుతాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని ఆయన విమర్శించారు.

## అందుకే తక్కువ ధరకు భూములు ఇస్తున్నాం

### కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం



- పదేళ్లు మంత్రిగా ఉన్న కేటీఆర్ ప్రజలకు అవాస్తవాలు చెబుతున్నారన్న శ్రీధర్ బాబు
- బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన జీవో ప్రకారమే భూములు బదిలీ చేస్తున్నామన్న మంత్రి
- కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారని వెల్లడి

వివరాలు 2లో..

## కర్ణాటక సీఎం మార్పు అంశం...

### కీలక వ్యాఖ్యలు చేసిన డీకే శివకుమార్



- ఐదేళ్లు సిద్ధరామయ్యనే ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్న డీకే శివకుమార్
- గ్రూపు రాజకీయాలు చేయడం తన రక్తంలో లేదని ఉద్ఘాటన
- కాంగ్రెస్ పార్టీ 140 మంది ఎమ్మెల్యేలు నా వారే అంటూ వ్యాఖ్యలు

వివరాలు 2లో..

## బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం... సీఐడీ విచారణకు హాజరైన శ్రీముఖి, నిధి అగర్వాల్

- లక్డీకాపూల్ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరైన సినీతారలు
- బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన వారిని విచారిస్తున్న సీఐడీ
- జంగిల్ రమ్మీకి ప్రమోట్ చేసిన శ్రీముఖి



**హైదరాబాద్ పెన్ పవర్:**బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన వ్యవహారం లో ప్రముఖ సినీ తారలు నిధి అగర్వాల్, శ్రీముఖి, అమృతా చౌదరి సీఐడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన ప్రముఖులను సీఐడీ

వివరాలు 2లో..

## రూ.5 లక్షల కోట్ల స్కామ్‌కు సీఎం తెరలేపిండు..

### మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి రూ.5 లక్షల కోట్ల స్కామ్‌కు తెరలేపాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ రోజు ఆయన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. నగరంలో పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ పేరుతో రూ.5 లక్షల కోట్ల కుంభకోణానికి సీఎం తెరలేపాడని ఆరోపించారు. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణమని అన్నారు. 9,292 ఎకరాల భూమిపై ముఖ్యమంత్రి కన్నేశాడని అన్నారు. కేవలం 30 శాతం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలని.. ఈ పాలసీ ద్వారా కుంభకోణం చేయబోతున్నారని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం

వివరాలు 2లో..

## కేటీఆర్‌కు పచ్చకామెర్లు సోకాయి



- రేవంత్ కుటుంబాన్ని కేటీఆర్ విమర్శించడంపై చామల ఆగ్రహం
- బీఆర్ఎస్ హయాంలో సాగింది ఫాం హౌస్ పాలనేనని ఆరోపణ
- ఎన్నికల్లో ఓడినా కేటీఆర్‌కు బుద్ధి రాలేదని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై భువన గిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు

వివరాలు 2లో..

## తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీ

- 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ
- పోలీసు శాఖలో ప్రధాన విభాగాలకు కొత్త సారథుల నియామకం
- చౌహాన్‌కు అదనపు డైరెక్టర్ జనరల్ బాధ్యతలు




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో భారీ సంఖ్యలో ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ బదిలీలలో భాగంగా పోలీసు శాఖలోని ప్రధాన విభాగాలకు కొత్త సారథులను నియమించింది. చౌహాన్‌కు అదనపు డైరెక్టర్ జనరల్ (పర్సనల్) వంటి అత్యంత కీలకమైన బాధ్యతలను అప్పగించింది.మహేశ్వరం డీసీపీగా నారాయణరెడ్డి, ఏడీజీ (పర్సనల్) గా చౌహాన్, నాగర్ కర్నూలు ఎస్పీగా సంగ్రామ్ పాటిల్, వికారాబాద్ ఎస్పీగా స్నేహ మిశ్ర, భూపాలపల్లి ఎస్పీగా సంకేత్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీశ్, వనపర్తి ఎస్పీగా సునీత, నార్కోటిక్ ఎస్పీగా పద్మలను బదిలీ చేసింది. మల్కాజ్‌గిరి డీసీపీగా శ్రీధర్,

వివరాలు 2లో..



## పాకిస్థాన్‌లోని కంపెనీలో బాయిలర్ పేలి 16 మంది మృతి

- ఫైసలాబాద్ జిల్లాలో ఉదయం ప్రమాదం
- పరారైన ఫ్యాక్టరీ యజమాని, పోలీసులు అదుపులో మేనేజర్
- శిథిలాల కింద మరికొంతమంది ఉండవచ్చని చెబుతున్న అధికారులు

**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో గల ఒక జిగురు తయారీ కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో దాదాపు 16 మంది కార్మికులు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ దుర్ఘటన లాహోర్ నుంచి 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫైసలా బాద్ జిల్లాలో ఉదయం సంభవించింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, శిథిలాల కింద మరికొంతమంది ఉండి ఉండవచ్చని

వివరాలు 2లో..

## స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసిన కడియం శ్రీహరి

- కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు స్పీకర్ నోటీసులు
- ఫిరాయింపు ఫిర్యాదులపై సమాధానం ఇవ్వాలని పేర్కొన్న స్పీకర్
- తనకు కొంత సమయం కావాలని అడిగిన కడియం శ్రీహరి



**హైదరాబాద్ పెన్ పవర్:**స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యుడు కడియం శ్రీహరి తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిశారు. పార్టీ ఫిరాయింపునకు సంబంధించి వివరణ ఇవ్వడానికి మరికొంత గడువు కావాలని ఆయన సభాపతిని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు

వివరాలు 2లో..

## 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్



**హైదరాబాద్ పెన్ పవర్:**పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సుమారు 30 వేల ఎకరాలల్లో ఫ్యూచర్ సిటీని ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని, స్కిల్ యూనివర్సిటీ, అంతర్జాతీయ క్రీడా మైదానాలు, ఐటీ, ఏఐ కేంద్రాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్ట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అన్ని అను మతలు లభించాయని చెప్పారు. పారిశ్రామిక ఎగుమతుల్లో విప్లవాత్మక మార్పులకు ఈ హైవే శ్రీకారం చుట్టనుందనీ చెప్పారు. ప్రజా భవన్ లో కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో డెల్లాయిట్, ఈవై, కేపీఎంజీ,

వివరాలు 2లో..

## ఇంత జరుగుతున్నా సబిత ఇంద్రారెడ్డి స్పందించకపోవడం దారుణం



- మహేశ్వరంలో సబిత అనుచరులు చెరువులను కబ్జా చేస్తున్నారని ఆరోపణ
- కబ్జాలపై సబిత స్పందించకపోవడం దారుణమన్న కవిత
- హైడ్రా కూడా కబ్జాలను పట్టించుకోవడం లేదని ఆరోపణ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసిందని వ్యాఖ్య

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవన్ వర్సెస్ ముద్రగడ.... సీన్ రిపీట్ అవుతుందా ?

ఏపీ రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభం అంటే తెలియని వారు లేరు. కాంగ్రెస్ నుంచి రాజకీయ అరంగేట్రం చేసి తెలుగుదేశం బీజేపీ మళ్ళీ కాంగ్రెస్ ఆ తర్వాత వైసీపీ ఇలా ముద్రగడ పద్మనాభం అర్ధ శతాబ్దం రాజకీయం అంతా సాగింది. ఇక ఆయన తీరు చూస్తే ట్రెడిషనల్ పొలిటీషియన్ కాదని అంటారు. ఆయన ఒక బలమైన సామాజిక వర్గం ఆకాంక్షల సాధన కోసం పోరు బాట పట్టారు అలా రాజకీయంగా పీక్స్ లో ఉన్న వేళ ఉప ముఖ్యమంత్రి స్థాయి పదవులు అందుకునే చాన్స్ ని సైతం మిస్ చేసుకుని ఆయన తాను అనుకున్న పంథాలోనే ముందుకు సాగారని చెబుతారు.

**పెద్దాయన గా :**

ఇక ముద్రగడ కాపు సామాజిక వర్గంలో పెద్దాయనగా ఈ రోజుకీ గుర్తింపు అందుకుంటునే ఉన్నారు. ఏడు పదుల వయసు చేరువలో ఉన్న ముద్రగడ ఆ మధ్య అంతా అనారోగ్య సమస్యలతో సతమతం అయ్యారు అయితే తాను బాగానే ఉన్నాను అని కూడా ఇటీవల కాలంలో చెప్పారు. జగన్ ని 2029లో సీఎం గా చేయడానికి తన వంతుగా కృషి చేస్తాను అని ముద్రగడ చెప్పి ఉన్నారు ఆయనకు వైసీపీ కూడా పార్టీ అత్యున్నత వేదిక అయిన రాజకీయ వ్యవహారాల కమిటీలో చోటు కల్పించింది. ఇక ముద్రగడ కుమారుడు గిరికి ప్రత్తిపాడు సీట్లో ఇంచార్జి గా నియమించింది.

**పవన్ మీదకే అస్త్రం :**

అయితే వైసీపీ అధినాయకత్వం గోదావరి జిల్లాలో క్రమంగా మారుతున్న సామాజిక రాజకీయ పరిణామలను దృష్టిలో ఉంచుకుని ముద్రగడ కుటుంబం మీదనే పెను భారం పెడుతున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ముద్రగడ కుమారుడు గిరిని ప్రత్తిపాడు కంటే కూడా పిఠాపురం నుంచి పోటీ చేయించే ఆలోచనలో వైసీపీ హైకమాండ్ ఉందని అంటున్నారు. ముద్రగడకు పిఠాపురంలోనూ పట్టు ఉంది. ఆయన అనుచర వర్గం పెద్ద ఎత్తున పిఠాపురంలో ఉంది. దాంతో కుమారుడికి టికెట్ ఇస్తే ముద్రగడ రంగంలోకి దిగితే ఇక పిఠాపురంలో వైసీపీ రాజకీయం నల్లేరు మీద నడక మాదిరిగా సాగిపోతుంది అని కొత్త ఆలోఅనలు వైసీపీ పెద్దలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు.

**ఆమె అవుట్ :**

ఇక ప్రస్తుతం పిఠాపురం వైసీపీ ఇంచార్జిగా ఉన్న వంగా గీత పెర్ఫార్మెన్స్ మీద వైసీపీ పెద్దలు పెదవి విరుస్తున్నారు అని అంటున్నారు. మరో వైపు వంగా గీత సైతం తనకు పిఠాపురం అసెంబ్లీ సీటు వద్దని వేరే చోటకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని కూడా ప్రచారంలో ఉంది. అయితే ఆమెకు ఇంకో చోట చాన్స్ ఇస్తారా లేదా అన్నది పక్కన పెడితే పిఠాపురంలో మాత్రం వంగా గీత అవుట్ అయినట్లే అని అంటున్నారు. ముద్రగడ పద్మనాభం ఫ్యామిలీనే ఈసారి రంగంలోకి దించి పవన్ కళ్యాణ్ ని దెబ్బ కొట్టాలని మాస్టర్ స్కెచ్ గీస్తున్నారు అని అంటున్నారు.

**మోజు తీరిపోతుందనా :**

పవన్ కళ్యాణ్ రొటీన్ రెగ్యులర్ పొలిటీషియన్ కాదని వైసీపీ భావిస్తోంది. ఆయన మీద మోజుతో 2024 ఎన్నికల్లో గెలిపించారని ఇప్పటికే కాపులలో అంతర్మధనం మొదలైందని కూటమి పాలన పట్ల అసంతృప్తి కూడా నెమ్మదిగా పెరుగుతోందని అది కాస్తా 2029 ఎన్నికల నాటికి పీక్స్ కి చేరుకుంటుందని అంచనా వేస్తోంది. అలా కనుక జరిగితే మాత్రం పిఠాపురంలో ఫ్యాన్ గిర్రున తిరిగే అవకాశాలు కూడా కొట్టి పారేయలేమని అంటున్నారు. ఒక వేళ అది జరగకపోయినా గట్టి పోటీ ఇచ్చి అయినా పవన్ ని కట్టడి చేస్తే మిగిలిన నియోజకవర్గాలలో వైసీపీకి అది ఎంతో ఉపయోగంగా ఉంటుందని కూడా భావిస్తున్నారుట. మొత్తానికి పవన్ వర్సెస్ ముద్రగడగా సీన్ ని రిపీట్ చేయాలని ఆరాటపడుతోంది అని అంటున్నారు. మరి దీనికి పెద్దాయన ముద్రగడ ఏ మేరకు స్పందిస్తారు అన్నది కూడా చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# పాకిస్థాన్‌లోని కంపెనీలో బాయిలర్ పేలి 16 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఫ్యాక్టరీ యజమాని పరారీ కాగా, మేనేజర్‌ను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేలుడు తీవ్రత అధికంగా ఉండటం వల్ల సమీపంలోని భవనాలు కూడా దెబ్బతిన్నాయని ఫైసలాబాద్ డిప్యూటీ కమిషనర్ రాజా జహంగీర్ అన్వర్ మీడియాకు వెల్లడించారు. సహాయక బృందాలు ఇప్పటివరకు శిథిలాల నుంచి 15 మృతదేహాలను వెలికి తీశాయని, గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో ప్రాణనష్టం సంభవించినందుకు పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ప్రమాదంపై ఫైసలాబాద్ కమిషనర్ నుంచి నివేదిక కోరినట్లు తెలిపారు.

# అందుకే తక్కువ ధరకు భూములు ఇస్తున్నాం

మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని, కానీ పరిశ్రమలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పదేళ్లు మంత్రిగా ఉన్న కేటీఆర్ ప్రజలకు అసత్యాలు చెబుతున్నారని విమర్శించారు. తాము గత ప్రభుత్వం మాదిరి అడ్డగోలు జీవోలు, చెల్లింపులు చేయడం లేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏం చేసినా దానికి ఓ మతలబు ఉండేదని వ్యాఖ్యానించారు. కేటీఆర్ 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారని, కానీ పరిశ్రమలను ప్రోత్సహించడం అవసరమని అన్నారు. అయినా 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన జీవో ప్రకారమే తాము నగరంలోని భూముల బదిలీకి అనుమతి ఇచ్చామని అన్నారు. కేటీఆర్ ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజుకు తేడా తెలియనట్లుగా మాట్లాడుతున్నారని, ప్రభుత్వ భూమిని విక్రయించినట్లు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో కూడా చాలా భూములు బదిలీ చేశారని గుర్తు చేశారు. పారిశ్రామికవేత్తలను ఇబ్బంది పెట్టకూడదని అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములను ఇస్తున్నారని గుర్తు చేశారు. పెట్టుబడులు తీసుకురావడం, ఉపాధి పెంచడమే తమ ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత ఆ పార్టీ నేతలకు పగలు కూడా చుక్కలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. పెట్టుబడులు రాకూడదు.. తెలంగాణ అభివృద్ధి చెందకూడదని కేటీఆర్ ఆలోచనగా కనిపిస్తోందని విమర్శించారు. కేటీఆర్ చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఇంత జరుగుతున్నా సబిత ఇంద్రారెడ్డి స్పందించకపోవడం దారుణం

మాజీ మంత్రి, మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో సబితా ఇంద్రారెడ్డి అనుచరులే చెరువులను కబ్జా చేస్తున్నారని ఆమె ఆరోపించారు. కబ్జాలపై ఆమె స్పందించకపోవడం దారుణమని కవిత విమర్శించారు. హైడ్రా కూడా కబ్జాలను పట్టించుకోవడం లేదని ఆమె అన్నారు. మహేశ్వరంలోని రావిర్యాల, మంత్రాల చెరువులలో సబితా ఇంద్రారెడ్డి అనుచరులు కబ్జాలకు పాల్పడుతున్నారని, కానీ హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ఆమె నిలదీశారు. మున్ముందు ఈ కబ్జాలకు సంబంధించి పూర్తి వివరాలను హైడ్రాకు సమర్పిస్తామని,

వారు ఏం చర్యలు తీసుకుంటారో చూస్తామని అన్నారు. హైడ్రా ప్రత్యేకంగా సర్టిఫైడ్ ఏజెన్సీగా ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. కబ్జాలకు సంబంధించిన వివరాలను హైడ్రాకు ఇస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వెళతారేమోనని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు, ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తనకు తెలిసిందని ఆమె అన్నారు.

# కేటీఆర్‌కు పచ్చకామెర్లు సోకాయి

- మొదటి పేజి తరువాయి

గుప్పించారు. "పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. ప్రస్తుతం కేటీఆర్ పరిస్థితి కూడా అలాగే ఉంది" అని ఆయన ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ తీరుపె ఈ మేరకు ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఫాం హౌస్ పాలన తప్ప, ప్రజల కోసం పాలన చేయలేదని కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబాన్ని నిందించడం తప్ప కేటీఆర్‌కు మరో మార్గం కనిపించడం లేదని విమర్శించారు. అసలు రేవంత్ రెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. "కేసీఆర్ కుటుంబంలో మాదిరి రేవంత్ రెడ్డి కుటుంబంలో ఎవరూ పదవుల్లో లేరు కదా?" అని నిలదీశారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలకు మంచి చేయలేదని, ఇప్పుడు తాము చేస్తుంటే అడ్డుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వ్యాపారవేత్తలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా కేటీఆర్‌కు ఇంకా బుద్ధి రాలేదని, ఆయన తీరు మారలేదని చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసిన కడియం శ్రీహరి

- మొదటి పేజి తరువాయి

అసెంబ్లీ స్పీకర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వారిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి అందజేశారు. ఈ నేపథ్యంలో, ఫిరాయింపు ఫిర్యాదులపై స్పందించాలని కడియం శ్రీహరితో పాటు దానం నాగేందర్‌కు సభాపతి ఇటీవల మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23వ తేదీలోగా అఫిడమిట్ రూపంలో సమాధానాలు సమర్పించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

ఈ క్రమంలో కడియం శ్రీహరి సభాపతిని కలిసి వివరణ ఇవ్వడానికి కొంత సమయం కావాలని కోరారు. మరోవైపు, ఢిల్లీ పర్యటనలో ఉన్న మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ తిరిగి వచ్చిన వెంటనే సభాపతిని కలవనున్నారు. దానం నాగేందర్ కూడా మరికొంత సమయం కోరే అవకాశం ఉంది.

# సీఎం రేవంత్ రెడ్డికి నన్ను అరెస్ట్ చేసే ధైర్యం లేదు

- మొదటి పేజి తరువాయి

కనీసం 100 శాతం నుంచి అత్యధికంగా 200 శాతం ఎస్ఆర్ఓ రేట్లు చెల్లించాలని నిర్దేశించగా, కాంగ్రెస్ కేవలం 30 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని కొత్త పాలసీ తెచ్చిందని అన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్‌లో భారీ స్కామ్‌కు ప్లాన్ చేశారని మండిపడ్డారు. ఇప్పటికే ఆ భూములకు సంబంధించి రేవంత్ రెడ్డి అన్నదమ్ములు, అనుచరులు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నారని మీడియాకు వివరించారు. అందుకే ఆగమేఘాల మీద కేవలం ఏడు రోజుల్లో దరఖాస్తులు, మరో ఏడు రోజుల్లో ఆమోదం, 45 రోజుల్లో రెగ్యులరైజేషన్ అంటూ హడావిడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**పారిశ్రామికవేత్తలారా.. బీ కేర్‌ఫుల్**

కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన హైదరాబాద్ పారిశ్రామిక భూముల ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ అనేది కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌కు ఏటీఎంగా మారిందన్నారు. ఆ భూములు కొనుగోలు చేసినా.. రెగ్యులరైజేషన్ చేసుకున్నా.. పారిశ్రామికవేత్తలకు భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ప్రజల ఆస్తిని అప్పనంగా కొట్టేస్తామంటే కుదరదని అన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ అవసరమైతే న్యాయపోరాటం చేస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం మళ్లీ వచ్చిన తర్వాత నగరంలోని పారిశ్రామిక భూముల లావాదేవీలపై తప్పకుండా విచారణ ఉంటుందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కేవలం రేవంత్ రెడ్డి అవినీతి కోసం ఈ పాలసీలో భాగస్వాములై భవిష్యత్తులో ఇబ్బందులు పడవద్దని పారిశ్రామికవేత్తలకు కేటీఆర్ సూచించారు. పరిశ్రమలు తీసుకొచ్చేందుకు రూపొందించిన టీఎస్ ఐ-పాస్ విధానాన్ని పారిశ్రామిక భూములు అమ్మేందుకు కాంగ్రెస్ వాడుతోందని కేటీఆర్ ఆరోపించారు.

# తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీ

- మొదటి పేజి తరువాయి

సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ఖార్గే, టాస్క్‌ఫోర్స్ డీసీపీగా వైభవ్ గైక్వాడ్, సీఐడీ డీజీగా పరిమళ నూతన్, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎం. చేతనలు నియమితులయ్యారు.

# 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్

- మొదటి పేజి తరువాయి

బీసీజీ, పీడబ్ల్యూ సీ, జెఎల్ఎల్ సహా పలు సంస్థల ప్రతినిధులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడు తూ 'ప్రజాప్రభుత్వం 2047 నాటికి రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసు కెళ్లాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తుంది. రాష్ట్ర అర్థికాభివృద్ధికి, పెట్టుబడులకు వాతావరణ పరిస్థితులు, భౌగోళిక అంశాలతో పాటుగా నైపుణ్యంతో కూడిన తక్కువ ధరలకే మానవ వనరులు అందుబాటులో ఉండడం కలిసివచ్చే అంశాలు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు 39 రేడియల్ రోడ్ల ప్రణాళిక రూపొందించాం. వీటి మధ్యలో ఫార్మా, ఐటీ, హ్యాండ్లూమ్, ఆగ్రో వంటి పారిశ్రామిక పార్కులు రాబోతున్నాయి' అని అన్నారు.

# సీఐడీ విచారణకు హాజరైన శ్రీముఖి, నిధి అగర్వాల్

- మొదటి పేజి తరువాయి

అధికారులు వరుసగా విచారిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల నటులు విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్‌లను సీఐడీ అధికారులు విచారించారు. యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిని సీఐడీ వరుసగా విచారణకు పిలుస్తోంది. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి వీరు విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ యువత ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో, వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులపై కొన్ని నెలల క్రితం కేసు నమోదైంది. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్ అంశంపై దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. శ్రీముఖి జంగిల్ రమ్మీ యాప్‌ను ప్రమోట్ చేయగా, అమృత చౌదరి పలు బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేశారు.

# కర్ణాటక సీఎం మార్పు అంశం... కీలక వ్యాఖ్యలు చేసిన డీకే శివకుమార్

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెరదించారు. ఐదేళ్ల పాటు సిద్ధరామయ్యనే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, ఆయనకు తాము పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. గ్రూపు రాజకీయాలు చేయడం తన రక్తంలోనే లేదని ఆయన అన్నారు. ఎవరో కొంతమంది మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీకి చెందిన 140 మంది ఎమ్మెల్యేలు కూడా తనవారే అని ఆయన వ్యాఖ్యానించారు. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సిద్ధరామయ్య చెప్పారని, ఈ నేపథ్యంలో పలువురు ఎమ్మెల్యేలు ఢిల్లీలో అధిష్ఠానం పెద్దలను కలిశారని ఆయన అన్నారు. వారు మంత్రి పదవుల కోసమే కలిసి ఉంటారని, అది సహజమేనని, ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. మంత్రి పదవి కోసం వారు ముఖ్యమంత్రిని కూడా కలిశారని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు తమంతట తామే వెళ్లారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 140 మంది ఎమ్మెల్యేలు మంత్రి పదవులకు అర్హులేనని, వారికి ఏ బాధ్యత అయినా అప్పగించవచ్చని శివకుమార్ అన్నారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సిద్ధరామయ్య స్పష్టం చేశారని, ఆయనకు తాను శుభాకాంక్షలు చెబుతున్నానని అన్నారు. మేమంతా కలిసి పనిచేస్తామని అన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం తరచూ చర్చనీయాంశంగా మారుతోంది. డీకే శివకుమార్ వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఢిల్లీ బాట పట్టడంతో తాజాగా మరోసారి కర్ణాటక రాజకీయాలు వేడెక్కాయి. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో డీకే శివకుమార్‌కు అవకాశం ఇవ్వాలని ఆయన వర్గం కోరుకుంటోంది. ఈ మేరకు అధిష్ఠానంపై ఒత్తిడి తేవడానికి ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లారు. ఈరోజు డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేల బృందం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

**సీఎం మార్పు ప్రచారాన్ని కొట్టిపారేసిన సుర్జేవాలా**

నాయకత్వ మార్పుపై జరుగుతున్న ప్రచారాన్ని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రణ్?దీప్ సుర్జేవాలా తోసిపుచ్చారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ చేస్తున్న దుష్ప్రచారమని ఆయన ఆరోపించారు. సిద్ధరామయ్య, శివకుమార్‌లతో తాను చర్చలు జరిపానని కూడా ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మార్పు అంటూ పార్టీకి చెందిన వారెవరూ బహిరంగ ప్రకటనలు చేయవద్దని ఆయన హెచ్చరించారు.


**స్పందించిన సిద్ధరామయ్య**

నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం మాత్రమే నిర్ణయం తీసుకుంటుందని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఖర్గే, గాంధీల నిర్ణయమే శిరోధార్యమని అన్నారు. అధిష్ఠానం మాటకు తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉంటామని తెలిపారు. మరోవైపు, ఈరోజు ఉదయం సిద్ధరామయ్య పార్టీ అధినేత ఖర్గేకు ఫోన్ చేశారు. నిత్యం ముఖ్యమంత్రి మార్పు అంశంపై మాట్లాడుతుండటం రాష్ట్రంలో పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని ఆయన వివరించారు. ఈ అంశానికి తెరదించుతామని

# పలు భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్న ముదునూరి మురళి కృష్ణంరాజు







**ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 21** : నియోజకవర్గ వైయస్సార్‌సిపి నాయకులు, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు శుక్రవారం ప్రత్తిపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాచపల్లి గ్రామంలో చిన్న సారిపల్లి వారి గంగాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన మహోత్సవంలో పాల్గొన్న మురళిరాజు అన్నదాన కార్యక్రమం కోసం 5 వేల రూపాయలు విరాళం అందజేశారు. ధర్మవరం గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రారంభమైన చతుర్థ సప్తాహ మహోత్సవాల మొదటి రోజుకు కమిటీకి వారికి 8 వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్, సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి నానిబాబు, వోమ్మి వెంకటరమణ, గొర్రెల రాంబాబు, నార్పిరెడ్డి వీరబాబు, ద్రాక్షరపు సత్తిబాబు, సమాన శివాజీ, ఎంపీటీసీ నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, గంగాలమ్మ కమిటీ సభ్యులు మరియు కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధి, భక్తి కార్యక్రమాల ప్రోత్సాహం, గ్రామీణ ప్రజలతో అనుబంధం పెంపొందించడంలో భాగంగా మురళిరాజు పర్యటనలు కొనసాగుతాయని స్థానిక నాయకులు తెలిపారు.

## పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వండి: ఆర్డీవో శ్రీకర్





**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు21:**పుస్తకాలను ఇష్టంతో చదవడం వల్ల జ్ఞానం, మనోవికాసం పెరుగుతాయని,అందుకే ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్నిఅలవాటు చేసుకోవాలని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పి. శ్రీకర్ సూచించారు. కొత్తపేట శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను గ్రంథ పాలకురాలు కుంచే సునీత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో శ్రీకర్ మాట్లాడుతూ టీవీ,సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి పుస్తకాలకు సమయం కేటాయించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ,ఆటలతో పాటు తల్లి సూచన ప్రకారం'బారిష్టర్ పార్వతీశం'పుస్తకం చదివినట్లు,ఆ పుస్తకం తనలో మంచి ఆలోచనలను పెంపొందించిందని చెప్పారు.గ్రంథ పఠనం విద్యార్థులలో విజ్ఞానం,ఆలోచనా శక్తిని పెంచుతుందనీ,అందుకే పఠనానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో చిత్రలేఖనం, వ్యాసరచన, పాటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం గ్రంథ పాలకురాలు సునీత, రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎస్. వీరన్న, జాయింట్ సెక్రటరీ కూచి మంచి సుధాకర్, రిటైర్డ్ లైబ్రేరియన్ చామకూర నాగేశ్వరరావు తదితరులు ఆర్డీవో శ్రీకర్‌ను దుస్సాలు,పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట తహసీల్దార్ వై. రాంబాబు,వీఆర్వోలు వీరేంద్ర,ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం,కె. శ్రీనివాస్,కుసుమ అనూష, లలిత తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం గా ప్రభుత్వం చర్యలు

గోదావరిలో చేప,రొయ్య పిల్లలను వదిలిన కలెక్టర్ కీర్తి చేకూరి , ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21**

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ధవళేశ్వరం కంచర్ల ఘాట్ వద్ద గోదావరిలో 50 లక్షల చేపపిల్లలు, 5 లక్షల రొయ్యపిల్లలను విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, మత్స్యకార కుటుంబాల సంక్షేమం ప్రభుత్వానికి ప్రాధాన్యమని తెలిపారు. చేపల వనరుల పెంపుతో పాటు, లైసెన్స్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేయడం తో ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వ పథకాల పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 4 వేల మంది వేట వృత్తిలో ఉన్నప్పటికీ, అనేక మంది లైసెన్స్ లేకుండా పని చేస్తుండటాన్ని గుర్తించామన్నారు.

ఈ నెలాఖరులోగా ప్రతి మత్స్యకార కుటుంబం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలనే దిశగా మత్స్య, రెవెన్యూ శాఖలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సచివాలయంలో రూ.120 (బోట్, నెట్), రూ.50 (విసురవల) ఫీజుతో లైసెన్స్ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, లైసెన్స్ పొందినవారికి గ్రూప్ ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అన్నారు. సభాధ్యక్షులు, రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, దేశంలో చేపల ఉత్పత్తిలో 25.64% , రొయ్యల ఉత్పత్తిలో 75% ఆంధ్రప్రదేశ్ నుండి వస్తుందని తెలిపారు. వ్యవసాయంతో పాటు సమాన ప్రాధాన్యంతో ఆక్వా రంగాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రాష్ట్ర జీడీపీ , ప్రజల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మత్స్యకారుల జీవనాధారాన్ని కాపాడేందుకు చేపలు పెరిగే కాలంలో వేట నిషేధాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నామని బుచ్చయ్య చౌదరి తెలియ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ మత్స్యకారుల సహకార సంఘ ఇద్దరు అధ్యక్షులకు సత్కారం,ఫిష్ సీడ్ ఫామ్, మొంత తుఫానులో ఉత్తమ సేవలను అందించినందుకు ఉత్తమ గ్రామ మత్స్య సహాయకులకు సత్కారం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల లో యుజి , పిజీ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ విజయవంతంగా పూర్తి చేసిన 30 మందికి సర్టిఫికెట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, జేడీ ఫిషరీస్ ఎన్. నిర్మలా కుమారి, మత్స్య కారులు స్థానిక ప్రజా ప్రతినిధులు మండల నాయకులు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన డైరెక్టర్ పందురి అప్పారావు, పుక్కళ్ల రాజు, తలారి మూర్తి, ఎడ్ల మహేష్, గుర్రాల వెంకట్రావు, ఆళ్ల ఆనందరావు, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, పంచాయితీ కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# సంఘ సేవకులు, కైలాస భూముల నిర్మాత పట్టపగలు కు సతీ వియోగం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ నవంబర్ 21, :** సంఘ సేవకులు, కైలాస భూముల నిర్మాత పట్టపగలు వెంకట్రావు సతీమణి శ్రీమతి పట్టపగలు అనంత రామలక్ష్మి, శు క్రవారం ఉదయం నోటి క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతూ విశాఖపట్నం అపోలో హాస్పిటల్ లో తుది శ్వాస విడిచారు. శ్రీమతి అనంత రామలక్ష్మి 1954 సంవత్సరం జనవరి నెలలో ముమ్మిడివరం గ్రామం లోని మండే వెంకట్రావు, శ్రీమతి అచ్చియమ్మ దంపతులకు ముగ్గురు సంతానం లో ప్రథమ కుమార్తెగా జన్మించారు. శ్రీమతి అనంత రామలక్ష్మి మెట్రిక్ వరకు చదువుకున్నారు. తర్వాత 1969 వ సంవత్సరంలో వేమగిరికి చెందిన పట్టపగలు వెంకట్రావు తో వివాహము జరిగినది. ఈ దంపతులకు నలుగురు ఆడపిల్లలు కాగా శ్రీమతి అనంతలక్ష్మి సంఘ సేవలో ముందు ఉంటూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి తరపున ఇన్నర్ వీల్ క్లబ్ చైర్మన్ గా పనిచేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సొంతంగా అనంత సేవానికేతన్ సంస్థ ను స్థాపించి బొమ్మూరులోని బబ్బర్ సింగ్ కాలనీలో గృహ నిర్మాణాలు జరిపారు. నగరం లో మంగళవారం పేట లోని మున్సిపల్ స్కూలును దత్తత తీసుకుని భవనాలు నిర్మించి ఫర్నిచర్, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ లు అందజేశారు. సంఘ సేవలో భర్త పట్టపగలు వెంకట్రావుకు చేదోడు వాదోడుగా ఉంటూ శ్రీమహకాళే శ్వరాలయం నిర్మాణంలో పాలుపంచు కున్నారు. అనంతసేవానికేతన్ నుంచి సమాజంలో సేవా కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తులను, ప్రముఖులను గుర్తించి అనంత సేవా పురస్కారాలను ప్రధానం చేసేవారు. శ్రీమతి అనంతలక్ష్మి పార్థవ దేహాన్ని విశాఖపట్నం నుంచి శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు మల్లిన నగర్ లోని స్వగృహం వద్దకు చేరుతుంది. ప్రజలు, బంధువులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం శనివారం ఉదయం 11 గంటల వరకు ఉంచి నగరంలోని ఇన్నిస్ పేటలోని రోటరీ కైలాసభంలో పంచ క్రియలు జరుపుతారు. అనంతలక్ష్మి మృతి వార్త తెలిసి పలువురు నగర ప్రముఖులు , యాదవ సంఘాల పెద్దలు పట్టపగలు వెంకట్రావు ను సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## జిల్లాలో ఈ నెల 22న ఉపాధి హామీ పై గ్రామ సభలు

– డ్వామా పిడి ఎమ్ నాగ మహేశ్వర రావు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21**

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 22వ తేదీన ఉపాధి హామీ పథకం పై గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. నాగ మహేశ్వర రావు శుక్రవారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పారదర్శకతను చేరువ చేయడం, సేవలను గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తేవడం ఈ గ్రామ సభల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సేవలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డు దరఖా స్తులను స్వీకరించి మంజూరు చేయాలని, ఇటీవల ఈ%-%కెవైసీ సమస్యల కారణంగా రద్దైన లేదా తొలగించిన జాబ్ కార్డులను మళ్లీ పరిశీలించి అర్హులైన వారికి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధి శ్రామికులు , గ్రామ ప్రజలు ఈ గ్రామ సభల్లో పాల్గొని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# ఎస్సీ కాలేజీ హాస్టల్ విద్యార్థుల ను వేధిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21:**స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉన్న ఎస్ సి కాలేజీ బాయ్స్ హాస్టల్ నె%శీ%:1 విద్యార్థులకు సరియైన భోజనం పెట్టలేదని , కాలేజీ కు వెళ్లే సమయానికి బ్రేక్ ఫాస్ట్ పెట్టలేదని అడిగినందుకు విద్యార్థులను వేదిస్తున్న వార్డెన్ కె ప్రభావతి విద్యార్థులను వేదిస్తున్నరని బి.ఎస్.పి జిల్లా ప్రెసిడెంట్ పట్నాల విజయ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ నక్కా వెంకటరత్నం రాజు ఆరోపించారు.

అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్, జిల్లా సోషల్ వెల్ఫేర్ హాస్టల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని నగర బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు.

శుక్రవారం స్థానిక బహుజన పార్టీ కార్యాలయం లో జరిగిన సమావేశంలో నాయకులు డిమాండ్ చేసారు. గత రెండు మూడు నెలలనుండి స్థానిక కాలేజీ బాయ్స్ హాస్టల్ వార్డెన్ కె. ప్రభావతి విద్యార్థులకు సరియైన భోజనం పెట్టకుండా ఇబ్బంది పెడుతుంద ని, విద్యార్థులు అడిగితే వారిపై పోలీస్ స్టేషన్లో కేసులు పెడుతున్నారని విమర్శించారు. దళిత విద్యార్థులని చూడకుండా విద్యార్థులను వేదిస్తున్నారని పై అధికారుల వద్ద కు న్యాయం చేస్తారని వెళితే హాస్టల్ వార్డెన్లను ఆఫీస్ కి పిలిపించి బెదిరించి భయభ్రాంతులకు గురించేస్తున్నారని ఆరోపించారు. దళిత విద్యార్థులకు రక్షణ కరువైందని వాపుతున్నారు. పోలీస్ స్టేషన్ కు పిలిచి వార్డెన్ కి సరియైన భోజన సదుపాయాలు కల్పించాలని సూచన చేసిన రోజు నుండి ఇంకా వేధింపులు ఎక్కువైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 17న పై విషయాన్నీ కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ కి పిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ వేధింపులపై విచారణ జరిపించి సదరు వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ అర్బన్ ఇంచార్జ్ ఇసుకపట్ల రాంబాబు కలక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ విచారణ లో విద్యార్థులను బెదిరించకుండా ఉండేందుకు తమను కూడా విచారణలో భాగం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో బి.ఎస్.పి జిల్లా ప్రెసిడెంట్ పట్నాల విజయ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ నక్కా వెంకటరత్నం రాజు, కొల్లాటి అబ్బులు, కొండపల్లి సూరిబాబు, కొనాల లాజర్, మోర్త మోహన్ కృష్ణ, మోర్త రామ్ మోహన్, కొత్తపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 21**:కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అభివృద్ధి పనులు వేగం పందుకోనున్నాయి. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పలు పనులకు శుభారంభం చేశారు. స్వాతంత్ర సమరయోధుల స్థూపాన్ని మరో అనుకూల ప్రదేశంలో పునరావస్థాపన చేసే పనులు ప్రారంభించారు.తరువాత ఆలయ పరిసరాల్లో ఉన్న సమస్యలు, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూ లైన్ల ఏర్పాటు, సౌకర్యాల విస్తరణపై అర్చకులతో అధికారులు సమీక్షించారు. భక్తులందరికీ మరింత మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

# బిర్యానీ హోటల్స్ ఆస్తులు మాములుగా లేవుగా ..20 కోట్ల క్యాష్...

**హైదరాబాద్, నవంబర్ 21, పెన్ పవర్:** మన దేశంలో ఎవరికైనా వ్యాపారం చేసే హక్కు ఉంది. వ్యాపారం ద్వారా లభించే ఆదాయానికి సంబంధించిన పన్ను సక్రమంగా చెల్లించాలి. ఇలా సక్రమంగా చెల్లించకుండా.. వ్యాపారం కోసం బ్యాంకుల దగ్గర రుణాలు తీసుకొని చాలామంది ఎగవేత కు పాల్పడుతుంటారు.. అలాంటి వారు దర్జాగా దేశాలు దాటి వెళ్లిపోతున్నారు.. ప్రజల సొమ్మును అప్పనంగా దోచుకుని విదేశాలలో దర్పాన్ని వెలగబెడుతున్నారు. ఇప్పటివరకు ఈ జాబితాలో విజయ్ మాల్యా, నీరవ్ మోడీ వంటి వారు ఉన్నారు. అయితే దేశంలో ఉంటూ.. దేశ సంపదను దోచుకునే వారు చాలామంది ఉన్నారు. ఐటీ అధికారులలో తనిఖీలలో వారు బయటపడ్డారు.మనదేశంలో ఒకప్పుడు హోటళ్ల వ్యాపారం ఒక స్థాయి వరకే ఉండేది. కానీ ఇటీవల కాలంలో ఆ వ్యాపారం అంతకుమించి అనే స్థాయిలో పెరిగింది. చాలామంది జనాలు ఇంట్లో తినడం కంటే.. బయట తినడానికి ప్రాధాన్యమిస్తున్నారు.
దీంతో ఆయా హోటళ్ల గిరాకీ విపరీతంగా పెరిగింది. ఆదాయం కూడా అంతకుమించి అనే స్థాయిలో వస్తోంది. దీంతో హోటల్స్ నిర్వహించేవారు కోట్లకు పడగలెత్తుతున్నారు. అయితే వీరంతా కూడా వచ్చిన ఆదాయానికి తగ్గట్టుగా టాక్స్ చెల్లించడం లేదు. పైగా తాము పొందిన డబ్బును వివిధ మార్గాలలో పెట్టుబడులు పెడుతున్నారు. ఆ పెట్టుబడుల ద్వారా వచ్చిన డబ్బును కూడా ఇతర మార్గాలకు తరలిస్తున్నారు. తద్వారా ఇంకా తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. అయితే వీరి వ్యవహార శైలి పట్ల ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో వారు సోదాలు చేశారు. ఫలితంగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.ఆదాయపు పన్ను శాఖ అధికారులు కొద్దిరోజులుగా హైదరాబాద్ నగరంలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. వాస్తవానికి ఈ వార్తలు మీడియాలో అంతగా రావడం లేదు. అంతర్గత వర్గాల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం హైదరాబాదులోని ప్రముఖ బిర్యాని హోటల్స్ పిస్తా హౌస్, షా గౌస్ యజమానుల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో భారీగా నగదు, బంగారం పట్టుపడ్డాయి. అధికారులు సోదాలు నిర్వహిస్తున్న సమయంలో 20 కోట్లు నగదు, పెద్ద మొత్తంలో నగదు, ఆస్తి పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు ఈ హోటల్ నిర్వాహకులు భారీగా ఆదాయం వస్తున్నప్పటికీ.. అదే స్థాయిలో పన్నులు చెల్లించకపోవడంతో దాడులు జరిగినట్టు తెలుస్తోంది.ఈ హోటల్స్ నిర్వహించే వారికి పెద్ద పెద్ద వ్యక్తులతో పరిచయాలు ఉన్నాయి.. అందువల్లే ప్రభుత్వాలకు సక్రమంగా పన్నులు చెల్లించడం లేదని తెలుస్తోంది. అయితే వీరంతా ఆ నగదును వివిధ రూపాలలో దాచినట్టు సమాచారం. దాదాపు 35 బృందాలు నగరంలోని 30కి పైగా ప్రాంతాల్లో ఈ సోదాలు నిర్వహించాయి. హోటళ్లలో జరిపిన తనిఖీల్లో వ్యాపార లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలతో పాటు, పెద్ద సంఖ్యలో హార్డ్‌డిస్క్‌లను అధికారులు సీజ్ చేశారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌ల ద్వారా వచ్చే ఆర్డర్లకు, సంస్థ చూపిస్తున్న లెక్కలకు మధ్య భారీ తేడాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.ఈ మూడు హోటళ్లలోనూ ఆన్‌లైన్ ఆర్డర్లకు సంబంధించిన సరైన వివరాలు లేకపోవడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్కులలోని సమాచారం ఈ కేసు దర్యాప్తులో కీలకం కానుందని, పూర్తి విశ్లేషణ తర్వాత పన్ను ఎగవేత ఏ స్థాయిలో జరిగిందనే దానిపై స్పష్టత వస్తుందని ఐటీ వర్గాలు భావిస్తున్నాయి. పైగా కీలక ఆస్తి పత్రాలను కూడా అధికారులు గుర్తించారంటే వీరి దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి మనం విజయ్ మాల్యా, నీరవ్ మోడీ గురించి మాట్లాడుకుంటాం. కానీ వారికి మించే స్థాయిలో ఇటువంటి హోటల్స్ నిర్వాహకుల అడ్డగోలు దందాలు ఉంటాయి.

# రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** (శుక్రవారం) ఉదయం శాయంపేట మండలం నేరేడుపల్లి, ప్రగతిసింగారం, వసంతాపూర్ మరియు కొప్పుల గ్రామాలల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఐకేపీ,
పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించిపండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలనిరైతులను ఎమ్మెల్యే కోరారు. రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరపాలని సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, రైతులు ఉన్నారు.ఎమ్మెల్యేను కలిసిన పెద్దకోడెపాక గ్రామ రజక కులస్తులుఈరోజుశుక్రవారం ఉదయం పెద్దకోడెపాక గ్రామ మడేలయ్య రజక సంఘం నాయకులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ను హన్మకొండ లోని వారి గృహంలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని చాకలి రేవుకుడి చెరువు వద్ద కులదైవమైన మడేలయ్య ఆలయం నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని, శ్రీ మడేలయ్య, శ్రీ సీతల దేవత, శ్రీ ఈదమ్మ, శ్రీ వినాయకుడు, శ్రీ నంది మరియు శ్రీ శివలింగం విగ్రహాలను బహుకరించాలనికోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు.

# రామగుండంలో ఆటో డ్రైవర్ల దౌర్జన్యం

**గోదావరిఖని: పెన్ పవర్:** రామగుండంలో ఆటో డ్రైవర్ల దౌర్జన్యం రోజురోజుకు మితిమీరుతుందని స్థానిక ప్రజలు, ప్రయాణికులు అనుకుంటున్నారు. ఏక్కడ లేని విధంగా చార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రామగుండం లోని ఆటో డ్రైవర్లు
తమ ఇష్టానుసారంగా రేట్లు పెంచి ప్రయాణికుల నుండి అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నారని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు. ముఖ్యంగా రామగుండంలోని రైల్వే స్టేషన్ కు ముందున్న ఆటో డ్రైవర్లు ప్రయాణికులపై దౌర్జన్యానికి దిగడమే కాకుండా ప్రయాణికులతో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని కొందరు మహిళలు అంటున్నారు. అంతేకాకుండా స్థానిక ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలు నడుపుతున్నారని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు. రామగుండం రైల్వే స్టేషన్ ముందు విపరీతమైన ఆటోలు ఉండడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని వాహనదారులు అంటున్నారు. రామగుండంలో ఆటో డ్రైవర్లు రోడ్డుపైన ఇష్టా రీతిగా ఆటోలు తిప్పుతూ ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నారని అంటున్నారు.

**ఇష్టం వచ్చినట్లు పెంచిన ఆటో చార్జీలు.**

రామగుండం రైల్వే స్టేషన్ అడ్డా దగ్గర ఉన్న ఆటో డ్రైవర్లు తమకు ఇష్టం వచ్చినట్లు చార్జీలు పెంచడమే కాకుండా ప్రయాణికుల పట్ల ముఖ్యంగా మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా తాము చెప్పిన రేట్లు ఇవ్వాలంటూ దౌర్జన్యం చేస్తున్నారని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణికుల వద్ద అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ప్రయాణికులు అంటున్నారు.

**పరిమితికి మించి.**

రామగుండం రైల్వే స్టేషన్ అడ్డా డ్రైవర్లు ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను కూర్చో పెడుతున్నారని అంతేకాకుండా ఆటో డ్రైవర్లు చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు తమ ఆటోలో ఇష్టానుసారంగా సౌండ్ సిస్టంను ఏర్పాటు చేస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఆటో డ్రైవర్లు విధిగా వేయాల్సిన ఖాకి చొక్కాను ధరించకుండా వాహనాలు నడుపుతున్నారని, రామగుండంలో ఇంత జరుగుతున్న ఆటో డ్రైవర్ల పై స్థానిక పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కారణంగా ఆటో డ్రైవర్లు ప్రయాణికులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు.
మా అడ్డాలో రాపిడోలకు అనుమతి లేదు.

రామగుండం నియోజకవర్గంలో యువతకు, నిరుద్యోగులకు రాపిడో ఉపాధి అవకాశం కల్పిస్తున్న తరుణంలో కొందరు అల్లరి మూకలు , స్థానిక ఆటో డ్రైవర్లు రాపిడో డ్రైవర్లను వేధిస్తున్నారని రాపిడో డ్రైవర్లు అంటున్నారు.

రామగుండం రైల్వే స్టేషన్ పరిధిలో రాపిడులకు అనుమతి లేదని స్థానిక ఆటో డ్రైవర్లు, అందరూ అల్లరి మూకలు రాపిడో డ్రైవర్ల పై దాడి చేస్తున్నారని, రైడును క్యాన్సల్ చేపిస్తున్నారని రాపిడో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా రామగుండం రైల్వే స్టేషన్ సమీపంలోని ఆటో డ్రైవర్లు ప్రయాణికులను ఇబ్బందుల గురి చేయడమే కాకుండా అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తూ పరిమితికి మించి ఆటోలు నడుపుతున్న
మహిళలు, ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న స్థానిక పోలీసులు జోక్యం కల్పించుకోకపోవడంపై స్థానిక ప్రజలు అనుమానలు వ్యక్తం చేస్తున్నారు.

# సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని

**సికింద్రాబాద్: పెన్ పవర్:** వాహనదారులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం కృషి చేస్తున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం సనత్ నగర్ లోని ఫతే నగర్ ఫ్లై ఓవర్ వద్ద 30 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్నసిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత తో సకాలంలో జరిగే విధంగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫతే నగర్ ఫ్లై ఓవర్ విస్తరణ కోసం స్థల సేకరణలో భాగంగా గుర్తించిన ప్రాపర్టీ ల కు సంబంధించి ఉన్న అడ్డంకులను కూడా పరిష్కరించి సిసి రోడ్డు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానికులు పలు సమస్యలను
ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. అమీర్ పేట లోని కనకదుర్గమ్మ ఆలయం నుండి ఫతే నగర్ వరకు గల రహదారి నిత్యం ఎంతో రద్దీగా ఉంటుందని వివరించారు. ఇరుకైన రహదారి కారణంగా వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం లో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి ఇబ్బందులను తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. అమీర్ పేట, సనత్ నగర్, బేగంపేట, బాలనగర్, కూకట్ పల్లి, బోయిన్ పల్లి తదితర ప్రాంతాలకు ఎక్కువగా ఫతే నగర్ ఫ్లై ఓవర్ నుండి రాకపోకలు సాగిస్తుంటారని, ఫ్లై ఓవర్ ఇరుకుగా మారడంతో
తరచు ట్రాఫిక్ నిలిచిపోతుందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేయించి నట్లు చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే పనులు చేపట్టి ప్రజల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గోన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** నందిగామ పట్టణంలోని స్థానిక గ్రంథాలయం ప్రాంగణంలో గురువారం నాడు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరై గ్రంథాలయ అభివృద్ధికి పుస్తకాల ప్రాధాన్యతను వివరించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల్లో పాఠనాభిరుచిని పెంపొందించేందుకు గ్రంథాలయ శాఖ నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థిని%-%విద్యార్థులకు స్వయంగా బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ."పుస్తకాలు మనసుకు దివిటీలు. భవిష్యత్ తరాలు జ్ఞానం వైపు నడవాలంటే ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో గ్రంథాలయాలు చైతన్య కేంద్రాలుగా నిలవాలి. నందిగామ గ్రంథాలయంమరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహాయం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు.

## అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** వనస్థలిపురం పిఎస్ పరిధిలోని సాహెబ్ నగర్ గ్రామానికి చెందిన పారంద శ్రీకాంత్ హయత్ నగర్ చెందిన నలుగురు ఫైనాన్సర్స్ దగ్గర రెండు లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు.ఇటీవల శ్రీకాంత్ కి పెళ్లి నిశ్చయం అయింది అప్పు ఇచ్చిన వారు రోజు శ్రీకాంత్ కాల్ చేస్తూ పెళ్లి ఎలా చేసుకుంటావని ఫోన్లో బెదిరించడంతో మీ ఇంటికి తాళాలు వేసి రోడ్డు మీదకు లాగుతాము ఇజ్జత్ తీస్తామని చెప్పడం తో మనోవేదనతో గురి అయి మరణమే శరణ్యం అని భావించిఈరోజు సెల్ఫీ వీడియో తీసి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ శ్రీకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్ చేస్తున్న వనస్థలిపురం పోలీసులు....

## మార్కెట్ లో హెూండా సరికొత్త ఎస్యూవీ 'ఎలివేట్ ఏడీవీ'

**హైదరాబాద్ పెన్ పవర్:** హెూండా కార్స్ ఇండియా సరికొత్త ఎస్యూవీ 'ఎలివేట్ ఏడీవీ' ని మార్కెట్లో ప్రవేశపెట్టింది. యువతను ఆకట్టుకునేలా దీనికి అనేక అధునాతన ఫీచర్లు జోడించినట్టు మార్కెటింగ్ అండ్ సేల్స్ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ చెప్పారు. రెండు వెర్షన్లలో లభించే ఈ కారు ఎక్స్ షోరూమ్ ధర హైదరాబాద్లో రూ.15.20 లక్షల నుంచి రూ.16,66,800 వరకు ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలు తమకు అత్యంత కీలక మార్కెట్లని తెలిపారు. తమ మొత్తం అమ్మకాల్లో ఈ 2 రాష్ట్రాల వాటా ఏడు శాతం వరకు ఉంటుందన్నారు. వచ్చే ఏడాది అల్ఫా ఈవీ: వచ్చే ఆర్థిక సంవత్సరం అల్ఫా ఈవీ కారును భారత్లోనూ విడుదల చేయబోతున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే చార్జింగ్ పాయింట్ ఆపరేటర్లతో చర్చిస్తున్నట్టు కునాల్ చెప్పారు. ఈ ఈవీ కారును భారత్లో తయారుచేసి జపాన్తో సహా అనేక దేశాలకు ఎగుమతి చేయబోతున్నట్టు తెలిపారు.

## ఘనంగా తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్ టెక్నో-కల్చరల్ ఫెస్ట్

### పాల్గోన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**హైదరాబాద్ పెన్ పవర్:** ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ప్రసాద్ ఐమాక్స్లో తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్ టెక్నో-కల్చరల్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, సినీ ప్రముఖులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సాంస్కృతిక ప్రతినిధులు హాజరయ్యారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఫిల్మ్ ప్రొడ్యూసర్ దిల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, సినిమాలు భాషా అడ్డంకులు లేని కళ అని, ప్రజలను ఏకం చేసే శక్తి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు నార్త్ ఈస్ట్ ప్రాంతం నుంచి వచ్చిన సినిమాలను కూడా చూడాలని సూచించారు. ఇటువంటి సాంస్కృతిక మార్పిడి బంధాలను మరింత బలపరుస్తుందని చెప్పారు.తెలుగు సినిమా పరిశ్రమ దేశంలోనే అతిపెద్ద, అత్యంత ప్రభావవంతమైన పరిశ్రమలలో ఒకటని గవర్నర్ ప్రశంసించారు. "తెలుగు సినిమాలు నార్త్ ఈస్ట్లో కూడా విస్తృతంగా చూడబడుతున్నాయి. అవి సందేశభరితమైన, భావంతో కూడిన చిత్రాలు కావడం వల్ల అందరికీ అనుభూతిని కలిగిస్తాయి" అని ఆమె అన్నారు.
హైదరాబాద్లో నార్త్ ఈస్ట్ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, నగరం సాంస్కృతిక వైవిధ్యానికి కేంద్రంగా మారిందని గవర్నర్ అభినందించారు. సినిమా నిర్మాణంలో నూతనత, సహకారం, సమన్వయం చాలా అవసరమని సూచించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిల్మ్మేకర్లు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారని ఆమె పేర్కొన్నారు.మనందరం ప్రత్యేకమైనవాళ్లం, కానీ ఒక్క దేశానికి చెందినవాళ్లమే అని ఆమె ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమం జాతీయ సమైక్యత, సాంస్కృతిక ఏకత అనే సందేశాన్ని అందించిందని గవర్నర్ అన్నారు.

## యువత సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ సామాజికవేత్త మణిదీప్ జన్మదిన వేడుకాలు సోమాజిగూడ కత్రియా హోటల్లో ఘనంగా జరిగాయి.యువతరం అనేక సమస్యలతో పోరాడుతున్న నేటి భారతావనిలో ఒక దృఢ సంకల్పం యువత మార్పు కోసం మణిదీప్ అతిపిన్న వయసులోనే ట్రస్టును ఏర్పాటు చేసి సామాజిక సేవకు పూనుకున్నారు.కరోనా మహమ్మారి సమయంలో బయటికి రావడానికి భయపడ్డా ప్రజానీకానికి నేనున్నానంటూ, అండగా నిలబడి చలిలో పడుకునే యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు.అటువంటి వ్యక్తిత్వం ఉన్న మనిషి మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేలా ప్రముఖ వేద పండితులు చినజీయర్ స్వామి నుండి మొదలుకొని వారి శిష్యులందరూ ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆశీస్సులు ఇవ్వడంతో పాటు యువత చెడు మార్గాన్ని వదిలి మణిదీప్ లాంటి యువ సామాజికవేత్తను స్ఫూర్తిగా తీసుకొని విద్యా ఉద్యోగంలో రాణించడంతోపాటు సమాజ సేవలో కూడా వారి వంతు పాత్ర పోషించేలా ప్రతి యువకుడు యువతీ కృషి చేయాలని ఈ సందేశం ప్రతి కుటుంబం అందిపుచ్చుకోవాలని సేవా మార్గం తో కలిగే సంతృప్తి సంపాదనలో ఉండదనే విషయాన్ని గుర్తిరగాలని సందేశాన్ని ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు,రెడ్ క్రాస్ సొసైటీ భీమిరెడ్డి,నగరంలోని వివిధ స్వచ్ఛంద సేవకులు, ఇదే హోటల్లో ఓ కార్యక్రమానికి విచ్చేసిన విదేశీ యువతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కొడాలి, వల్లభనేనిలకు స్మూత్ వార్నింగ్





**విజయవాడ, నవంబర్ 21, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి సీరియస్ గా ఉన్నారు. పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఎదురుగా చూస్తుంటే బలమైన కూటమి. ఆపై కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంది. మొన్ననే బీహార్ ఎన్నికల ఫలితాలతో ఎన్డీఏ దూకుడుగా ఉంది. భవిష్యత్తులో ఏపీలో అటువంటి ఫలితాలు వస్తాయన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇటువంటి తరుణంలో తాను జాగ్రత్త పడకపోతే వచ్చే ఇబ్బందులు జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి 175 నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన నియోజకవర్గాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అయితే అక్కడ ఏమంత పరిస్థితి బాగాలేదని తెలుసుకొని జగన్మోహన్ రెడ్డి ఆశ్చర్యానికి గురయ్యారట. ఓ 20 మంది నియోజకవర్గ ఇన్చార్జిలు పార్టీకి అందుబాటులో లేరని గుర్తించారట. వారందరినీ తాడేపల్లికి పిలిపించి పార్టీలో ఉంటారా? నియోజకవర్గ బాధ్యతలు చూస్తారా? లేకుంటే ప్రత్యామ్నాయం చూసుకోమంటారా? అని అల్టిమేటం జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇందులో జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఇష్టమైన ఇద్దరు నేతలు ఉండడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది.కొద్దిరోజులుగా మాజీ మంత్రి కొడాలి నానిగుడివాడ నియోజకవర్గానికి దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయన దారుణ పరాజయం చవిచూశారు. ఊహించని ఓటమి పొందారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి కొడాలి నాని కనిపించడం మానేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ కు పరిమితం అయ్యారు. గుండెపోటు రావడంతో ఆయన బొంబాయి లోని పేరు మోసిన ఆసుపత్రిలో చికిత్స పొందారు. అటు నుంచి హైదరాబాద్ వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ గుడివాడలో మాత్రం యాక్టివ్ కావడం లేదు. కేసుల భయంతోనే కొడాలి నాని నియోజకవర్గానికి దూరంగా ఉన్నారన్న టాక్ ఉంది. మూడు నెలల తర్వాత యాక్టివ్ అవుతానని చాలా రోజుల కిందట చెప్పారు నాని. ఇప్పుడు పార్టీ కార్యక్రమాలు సైతం గుడివాడలో నిర్వహించడం లేదు. దీనిపైనే జగన్మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే జగన్ ప్రశ్నించేసరికి కొడాలి నాని షాక్ కు గురైనట్లు సమాచారం.ఇక వల్లభనేని వంశీసైతం జగన్మోహన్ రెడ్డి పిలిచిన 20 మంది నేతల్లో ఒకరు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వల్లభనేని వంశీ పై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. చాలా రోజులపాటు వంశీ రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. జైల్లో ఉన్నప్పుడే తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత గన్నవరంలో యాక్టివ్ అవుతానని చెప్పారు. అయితే కాలం గడుస్తున్నా.. వల్లభనేని వంశీ మాత్రం గన్నవరంలో క్రియాశీలకం కావడం లేదు. అక్కడ పార్టీ కార్యక్రమాలు కూడా జరగడం లేదు. దీంతో జగన్మోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్టివ్ కాకుంటే ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని చూసుకుంటానని కూడా హెచ్చరించారట. ఈ పరిణామాన్ని ఊహించని వల్లభనేని వంశీ ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారట.అయితే జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని సమర్థించే క్రమంలో కొడాలి నానితో పాటు వల్లభనేని వంశీ ప్రత్యర్థులపై విరుచుకుపడేవారు. ముఖ్యంగా చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్ విషయంలో ఈ ఇద్దరు నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలు మామూలుగా ఉండేవి కాదు. అయితే ఈ వ్యాఖ్యలే ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని పలుచన చేశాయి. వీరి విషయంలో జగన్మోహన్ రెడ్డికి కూడా అనేక రకాల అభ్యంతరాలు ఉన్నాయి. ఇప్పుడు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండడంతో వీరిద్దరికీ షాక్ ఇచ్చేందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## ముందు నుయ్యి వెనుక గొయ్యి...

# కాంగ్రెస్ కిం కర్తవ్యం



**హైదరాబాద్, నవంబర్ 21, పెన్ పవర్:**
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హతా పిటిషన్లపై విచారణ ముగిసే దశలో ఉంది. సుప్రీం కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేయడంతో విచారణ వేగం పెంచారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేల క్రాస్-ఎగ్జామినేషన్ పూర్తి అయింది. దానం నాగేందర్, కడియం శ్రీహరిలుక తాజాగా నోటీసులు జారీ చేశారు. వీరిద్దరి విషయం పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. ఈ ఇద్దరూ పార్టీ మారినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. పార్టీ మారలేదని పిటిషన్లు తిరస్కరించడానికి అవకాశం లేకుండా పోయింది. 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేపై 'అంటీ-డిఫెక్షన్ లా' కింద అనర్హతా పిటిషన్లు దాఖలు చేసింది. 10వ షెడ్యూల్ ప్రకారం, పార్టీ విప్ ధిక్కరించి మరో పార్టీలోకి చేరితే అనర్హతా వేటు వేయాలి. సుప్రీం కోర్టు జూలై 31, 2025న స్పీకర్‌కు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోమని ఆదేశించింది. అయితే, స్పీకర్ ఇంకా సమయంకోరారు. బీఆర్ఎస్ మళ్లీ సుప్రీంకోర్టులో ధిక్కరణ పిటిషన్ వేసింది. నవంబర్ 17న కోర్టు 'కాంటెంప్ట్' నోటీసు జారీ చేసి, "రాజకీయ పక్షపాతం లేకుండా వెంటనే నిర్ణయం తీసుకోవాలి" అని హెచ్చరించింది. దీంతో స్పీకర్ వేగాన్ని పెంచుకుని, విచారణ పూర్తి చేస్తున్నారు. డిసెంబర్ 20లోపు నిర్ణయం ప్రకటించనున్నారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని వాంగ్మూలం ఇచ్చారు.
ఎనిమిది మంది ఎమ్మెల్యేలు క్రాస్-ఎగ్జామినేషన్‌లో "మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నాం" అని చెప్పారు. వారు అఫిడవిట్‌లు సమర్పించి, "పార్టీ మార లేదు, ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నాం అంతే" అని వాదించారు. బీఆర్ఎస్ వద్ద విప్ ధిక్కరణకు సంబంధించిన గట్టి ఆధారాలు లేకపోవడం వల్ల, ఈ ఎనిమిది మందిపై అనర్హతా వేటు వేయకపోవచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారు. "అంటీ-డిఫెక్షన్ లా ప్రకారం, పార్టీ మారినట్లు ప్రూఫ్ లేకుండా అనర్హతా వేయలేరు" అని నిపుణులు చెబుతున్నారు. స్పీకర్ బీఆర్ఎస్ పిటిషన్లను తిరస్కరించవచ్చు. వారు కోర్టుకు వెళ్తారా లేదా అన్నది తర్వాత విషయం. కానీస్పీకర్ అయితే నిర్మయం తీసుకుంటారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ విషయంలో బీఆర్ఎస్ వద్ద గట్టి ఆధారాలు ఉన్నాయి. శ్రీహరి కుమార్తె కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా గెలిచారు. ఆయన తాను బీఆర్ఎస్ లో ఉన్నానని చెప్పుకునేందుకు అంగీకరించడం లేదు. నాగేందర్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికెంద్రాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ విషయాన్ని కాదనలేరరు. ఇద్దరూ నోటీసులకు స్పందించకుండా అదనపు సమయం అడిగారు. ఇప్పుడు అఫిడవిట్లు సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఇద్దరిపై నిర్ణయం తీసుకోవాలంటే అనర్హతా వేటు వేయాల్సిందే. అనర్హతా వేటు వేయాల్సిన పరిస్థితి వస్తే ఆ ఇద్దరితో రాజీనామాలు చేయించి ఉపఎన్నికలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని రాజకీయవర్గాలుచెబుతున్నాయి. అనర్హాత వేటు కంటే.. రాజీనామా ద్వారా ఉపఎన్నికలకు వెళ్లడం కీలకం. అయితే పార్టీ మార్పు ద్వారా వచ్చిన ఉపఎన్నికల విషయంలో ప్రజలు వ్యతిరేకంగా స్పందించడానికి అవకాశాలు ఉంటాయి. అందుకే సీఎం రేవంత్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపఎన్నికలు రావు అంటున్నారు. ఇలాంటి విషయాల్లో స్పీకర్ నిర్ణయమే ఫైనల్ అవుతుంది. అందుకే ఈ వివాదం.. సుప్రీంకోర్టులో కొనసాగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

# ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ కర్ణాటక పంచాయితీ

**బెంగళూరు, నవంబర్ 21, పెన్ పవర్:** ఇప్పటికే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దారుణంగా మారింది. కర్ణాటక , తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఆ పార్టీ అధికారంలో ఉంది. ఇటీవల బీహార్ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహా ఘట్ బంధన్ గెలుస్తుందని.. అందులో కాంగ్రెస్ పార్టీకి సింహభాగం లభిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఊహించిన విధంగా బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఫలితాలు రాలేదు. పైగా ఈసారి సింగిల్ డిజిట్ స్థానాలకు మాత్రమే కాంగ్రెస్ పార్టీ పరిమితం అయిపోయింది. ఒకరకంగా ఆ పార్టీ అగ్రనాయకత్వానికి బీహార్ ఎన్నికలు తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించాయి.ఈ పరిణామాలు ఇలా ఉండగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి.. కర్ణాటక రాష్ట్రంలో సిద్ధరామయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అయితే కొంతకాలంగా ఇక్కడ ముఖ్యమంత్రి మార్పు ఖాయమని ప్రచారం జరుగుతోంది. ఆ మధ్య సిద్ధరామయ్య ఓ భూ కుంభకోణంలో చిక్కుకున్నారు. దీనికి సంబంధించి సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యులపై రకరకాల ఆరోపణలు వినిపించాయి. అయితే దీనిపై ఇప్పటికి విచారణ కొనసాగుతూనే ఉంది. ఇది ఇలా ఉండగానే సీతారామయ్య ను మార్చుతారని.. ఆయన స్థానంలో డీకే శివకుమార్ ను ముఖ్యమంత్రిగా చేస్తారని ప్రచారం మొదలైంది. అయితే నిన్నటి వరకు ఇది మీడియాలో ప్రచారంగా మాత్రమే ఉండేది. ఉన్నట్టుండి కర్ణాటక రాష్ట్రంలో ఊహించని విధంగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి. ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చుట్టూ అక్కడి రాజకీయాలు కేంద్రీకృతమయ్యాయి.కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, కొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీ వెళ్లారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా రెండున్నర సంవత్సరాలు అవుతోంది. ఈ క్రమంలో పవర్ షేరింగ్ కోసం అధిష్టానం మీద ఒత్తిడి తీసుకురావడానికి డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్ళినట్టు తెలుస్తోంది. బుధవారం రాత్రి ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తో, గురువారం తీసి వేణుగోపాల్ తో డీకే ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భేటీ అవతారని తెలుస్తోంది. జాతీయ మీడియాలో ప్రధానంగా ఈ వార్తలు ప్రసారం అవుతున్న నేపథ్యంలో కచ్చితంగా ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని తెలుస్తోంది. అయితే ఈ పరిణామాలపై డీకే వర్గం ఇంతవరకు నోరు మెదపలేదు. ఢిల్లీ ఎందుకు వెళ్తున్నారని విషయంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు.
కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన తర్వాత వాస్తవానికి డీకే శివకుమార్ కు ముఖ్యమంత్రి పీఠం ఇవ్వాలని అధిష్టానం నిర్మించినట్లు సమాచారం. కర్ణాటకలో కాంగ్రెస్ గెలవడానికి కూడా శివకుమారే ప్రధాన కారణం. అయితే అధిష్టానంలో కొంతమంది వ్యక్తులు సిద్ధరామయ్యకు అనుకూలంగా ఉండడంతో శివకుమార్ కు దక్కాల్సిన ముఖ్యమంత్రి పీఠం సిద్ధ రామయ్యకు సొంతమైంది. అయితే అప్పట్లో పవర్ షేరింగ్ ఒప్పందం కుదిరినట్టు సమాచారం. అందువల్లే డీకే శివకుమార్ ఆ విషయాన్ని గుర్తు చేయడానికి ఢిల్లీ వెళ్లినట్టు సమాచారం.

## శబరిమల యాత్ర భక్తుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన పోలీసులు పై చర్యలు తీసుకోవాలి

**శబరిమల క్షేత్రం ప్రాశస్త్యం దెబ్బ తీసే విధంగా నాస్తిక ఎల్ డీఎఫ్ వ్యవహరిస్తోంది**

**ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ ఆగ్రహం**

**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడ..నాస్తిక ఎల్డీఎఫ్ ప్రభుత్వ విధానాల వల్ల శబరిమలలో అయ్యప్ప భక్తులు పడుతున్న కష్టాలు చూసి నా హృదయం చలించిపోతందన్నారు. శబరిమల పవిత్ర క్షేత్రం పట్ల కనీస గౌరవం లేకుండా, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో కేరళ కమ్యూనిస్ట్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది. అయ్యప్ప సేవా సంఘం, అమృతానందమయి మఠం లాంటి ధార్మిక సంస్థలు సేవ చేయకుండా అడ్డుకోవడం ఈ ప్రభుత్వానికి హిందువుల పట్ల ఎంత వ్యతిరేకత ఉందో తెలియజేస్తుంది. హిందువుల మనోభావాలను గౌరవించని ఈ ప్రభుత్వం తక్షణం తమ వైఖరిని మార్చుకోవాలి. భక్తుల ఇబ్బందులకు కేరళ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. శబరిమల పవిత్ర తను దెబ్బ తీయడానికి ఎల్ డీఎఫ్ కుట్రలు పన్నుతోందని మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు బిజెపి రాష్ట్ర కార్యాలయం నుంచి మాధవ్ వీడియో విడుదల చేశారు

## బీజాపూర్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం..ఒకరు మృతి

**రంగారెడ్డి: పెన్ పవర్:** మొయినాబాద్ పరిధిలోని కనకమామిడి గేటు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఎదురు ఎదురు వచ్చి ఢీకొనడంతో ఒకరు స్పాట్ లోనే చనిపోయారు. 9 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ బీజాపూర్ రహదారిపై నిరంతరం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి ఈ నెలలో బస్సు ప్రమాదం మరువక ముందే నిన్న లారీ ప్రమాదం జరిగింది. ఈరోజు కారు ప్రమాదాలు వాహనదారులు రోడ్డు పనులను వేగవంతం చేయాలన్నారు..



## రేషన్ కార్డుదారులకు బిగ్ అలర్ట్!

**భారీ సంఖ్యలో లబ్ధిదారుల తొలగింపుబీ**

**న్యూఢిల్లీ, నవంబర్ 21, పెన్ పవర్:** దేశంలో చాలా మంది ఆర్థికంగా చాలా బలహీనంగా ఉన్నారు. పేద, అవసరమైన ప్రజలకు రెండు పూటలా ఆహారం కూడా దొరకదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ కింద వీరికి ఉచిత రేషన్ సౌకర్యం కల్పిస్తుంది.దేశంలో ఉచిత రేషన్, తక్కువ ధరలో రేషన్ పొందడానికి రేషన్ కార్డు తప్పనిసరి. ఇటీవల రేషన్ కార్డుల నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగిస్తున్నారనే వార్త వచ్చింది. అర్హత లేని వారిని తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయినప్పటికీ కార్డును ఉపయోగించుకుంటున్నారు.అనేక చోట్ల తనిఖీల్లో మరణించిన వ్యక్తుల పేర్లతో కూడా సంవత్సరాలుగా రేషన్ తీసుకుంటున్నట్లు తేలింది. ఇదంతా ఆపడానికి ధృవీకరణ వేగవంతం చేశారు. అనర్హులైన లబ్ధిదారులను నిరంతరం తొలగిస్తూనే ఉన్నారు. గత కొన్ని నెలల్లో ప్రభుత్వం ఉచిత రేషన్ పథకం నుంచి 2.25 కోట్ల పేర్లను తొలగించింది.ఆ పథకం కోసం అర్హత లేని వారిపైనే ఈ చర్య తీసుకున్నారు. లబ్ధి కేవలం అర్హులకే అందాలని మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. అందుకే అసలైన అవసరమైన వారు మాత్రమే వ్యవస్థలో కొనసాగేలా ప్రతి రాష్ట్రంలోనూ రికార్డులను మళ్లీ పరిశీలిస్తున్నారు.పరిశోధనలో చాలా మంది ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందడానికి మాత్రమే రేషన్ కార్డులు పొందారని తేలింది. కొంతమంది 6 నెలలుగా రేషన్ తీసుకోలేదు. దీని కారణంగా ప్రభుత్వం అలాంటి కుటుంబాలను %ూణు% జాబితా నుంచి తొలగించడానికి సిద్ధమవుతోంది.మీ పేరు కూడా జాబితా నుంచి తొలగించారని మీరు భావిస్తే ఆ విషయాన్ని తనిఖీ చేయడం సులభం. దీని కోసం %అటయి.స్త్రశీజ.అఅ% ని సందర్శించండి. ఇక్కడ రేషన్ కార్డ్ ఎంపికను ఎంచుకోండి. తరువాత %ఞఅశీఅ ఖుతీస ఐమ్మీఅశ్రీం వాఅ ళ్ఞవ్రాశీతీఖుశ్రీం%పై క్లిక్ చేయండి. ఇప్పుడు మీ రాష్ట్రం, జిల్లా, బ్లాక్, పంచాయతీని ఎంచుకోండి. తరువాత మీ రేషన్ షాప్, కార్డ్ రకాన్ని ఎంచుకోండి.మీ ముందు ఒక జాబితా కనిపిస్తుంది. మీ పేరు ఉంటే, మీ కార్డు యాక్టివ్ గా ఉంది. లేకపోతే, పేరు తొలగించారో తెలుస్తుంది. ఒకవేళ మీ రేషన్ కార్డు యాక్టివ్గా లేకపోయే %వ-ఖ్జ% చేయడం మర్చిపోవద్దు. %వ-ఖ్జ% అప్డేట్ చేయని కార్డులు మొదట డీయాక్టివేట్ చేస్తారు. తర్వాత తొలగిస్తారు.

## జోరుగా సాగుతున్న నీళ్ల వ్యాపారం

**హైదరాబాద్, నవంబర్ 21, పెన్ పవర్:** శుద్ధ జలం పేరిట కొందరు వ్యాపారులు మంచి నీళ్ల వ్యాపారంతో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్ల నీళ్లను సరఫరా చేస్తున్నా.. నీళ్ల వ్యాపారం జోరుగానేసాగుతోంది. వాటర్ ప్లాంట్ కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కాలంతో సంబంధం లేకుండానే నీళ్ల వ్యాపారంతో యేటా కోట్ల రూపాయల వ్యాపారంజరుగుతుంది. సుమారుగా 50శాతం మంది ప్రజలు మినరల్ వాటర్ డబ్బా నీళ్లనే వినియోగిస్తున్నట్లు తెలుస్తుంది.వేసవిలో ఈ వ్యాపారం మరింత ఊపందుకుంటుంది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన మినరల్‌వాటర్.. ప్రస్తుతం పల్లెలకు కూడా సరఫరా అవుతుంది. ప్రతీ గ్రామంలో ఒకటి, రెండు వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నాయి. గతంలో ప్రభుత్వం ఏర్పా టు చేసిన ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలుమినరల్ వాటర్ వైపే మొగ్గు చూపుతున్నారు.మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీళ్లు శుద్ధ జలమని అధికారులు ఎంత చెబుతున్నా.. ప్రజలు ప ట్టించుకున్నట్లే కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో అక్రమంగామంచినీళ్ల వ్యాపారం జరుగు తున్నా.. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. అంతటా నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లను నడుపుతున్నా.. సంబంధిత శాఖల అధికారులు ప ట్టించుకున్నదాఖలాలే కనిపించడమే లేదు. ఏదైనా ఫిర్యాదులు వస్తే హడావుడి చేయడం, ఆ తర్వాత సైలెంట్ అయిపోవడం అధికారులకు అలవాటుగా మా రిందంటున్నారు. ఇంత జరుగుతున్నా.. జిల్లా అధికారులు
పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కొంత మంది వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నేరుగా నీటిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వాటర్ ప్లాంట్ కేంద్రాలలో నీటిని శుభ్రపర్చకుండానే సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది. చాలాచోట్ల శుద్ధి చేయని నీటి క్యాన్లలోనే నీళ్లను నింపుతూ ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. ఆ నీటినే మినరల్ వాటర్గా భావిస్తున్న ప్రజలు అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. ప్రతీ నిత్యం ప్లాస్టిక్ డబ్బాలనుశుభ్రపర్చాల్సి ఉండగా.ఏ వాటర్ ప్లాంట్ కేంద్రంలో నూ ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. 20లీటర్ల ప్లాస్టిక్ క్యాన్ను ఆరు నెలల వరకు వినియోగిస్తే దానిని తిరిగి వాడకూడదనే నిబంధన ఉన్నప్పటికీ.. అంతటా రెండు,మూడేళ్లుగా ఒకే వాటర్ క్యాన్ను ఉపయోగిస్తూ నీటిని సరఫరా చేయ డం పరిపాటిగా మారింది. నాసిరకమైన ప్లాస్టిక్ డబ్బాలు, నొక్కులు పడి లోపలి భాగంలో నాచు, పాకురు పేరుకుపోతున్నా.. పట్టించుకోవడమే లేదనివినియోగదారులు చెబుతున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు పూర్తిగా నల్లబడిపోయి అధ్వానంగా కనిపిస్తున్నా.. మార్చే ప్రయత్నం కూడా చేయడం లేదు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో తీవ్రమైన అనారోగ్యసమస్యలకు గురయ్యే అవ కాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.వాటర్ ప్లాంట్ నిర్వాహకులు తన ఇంటి వద్ద, కానీ పొలంలో కానీ ఒక నీటీ బావిని (అనగా బోర్ )వేయించుకో ఇష్టారాజ్యంగా నీటిని సరఫరాచేస్తున్నా.. అడిగే వారే కరువవుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. అసలు నిబంధనల ప్రకారం బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాం డర్డ్) నిర్ధేశించిన ప్రమాణాల ప్రకారమే నీటిని శుద్ధి చేయాలి. అలాగేవిశాలమైన గదులతో పాటు ఏయిర్ కండిషన్ ఉన్న గదులు, ప్రయోగశాల తప్పనిసరిగా ఉండాలి. రసాయన శాస్త్రంలో గాని, మైక్రో బయాలజీ లో కనీసం డిగ్రీ పట్టా పొందిన వారు నీటి శుభ్రతను పర్యవేక్షించాల్సిఉంటుంది. ఎంత మోతాదులో కాల్షియం, మెగ్నిషియం ఉందో? గమనిస్తూ ఉండాలి.కానీ, ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. కేవలం పదో తరగతి ఉత్తీర్ణత కాకపోయినా కొందరు యువకులను నియమించుకొని యథేచ్ఛగా నీటివ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అర్హత, అను భవం ఉన్న వారు ఎక్కడా కనిపించడం లేదు. అంతేకాకుండా నీటిని నింపడా నికి ముందు ప్లాస్టిక్ క్యాన్లను శుభ్రంగా కడిగి రివర్స్ ఆస్మోసిస్
వ్యవస్థ ద్వారా నీటిలో బ్యాక్టీరియాను నిర్మూలించాల్సి ఉంటుంది. ఆ తర్వాత బయోలాజికల్ బ్యాక్టీరియా పరీక్షలు జరపాలని నిపుణులు పేర్కొంటు న్నారు. అయినా ఎక్కడా ఇలాంటి నిబంధనలు పాటించిన దాఖలాలేకపిపించడం లేదు.

# కేడర్ లో కుమ్ములాటలు

**తిరుపతి, నవంబర్ 21, పెన్ పవర్:** :ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం అమలు చేయడంపై దృష్టి సారిస్తుంటే.. నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్లు కొట్టుకుంటున్నారు. అనేక నియోజకవర్గాల్లో టీడీపీలో గ్రూపులు బయలుదేరాయి. కొత్తగా చేరిన వారికి, పాతగా వచ్చిన వారికి మధ్య గ్యాప్ ఏర్పడింది. ఎన్నికయిన ఎమ్మెల్యేల తప్పిదం కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఎమ్మెల్యేలు తమకు అనుకూలురైన కొందరికే కాంట్రాక్టు పనులతో పాటు నామినేటెడ్ పదవులను ఇస్తుండటంతో ఇక దక్కని వారు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని భావించినా అది సాధ్యం కావడం లేదు. మంత్రి నారా లోకేశ్ కు ఈ విషయం చెప్పాలనుకున్నా అందుకు సమయం చిక్కడం లేదు..దీంతో అనేక నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. పార్టీ అగ్ర నాయకత్వం తప్పిదం లేకపోయినా స్థానిక నాయకత్వం కారణంగానే ఇటువంటి తప్పిదాలు, విభేదాలు ఎక్కువవుతున్నాయని తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలే సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. నియోజకవర్గంలో తాము పడుతున్న ఇబ్బందులు పార్టీ హైకమాండ్ దృష్టికి వెళతాయని వారు సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు. దీంతో పార్టీ పరువు రోడ్డున పడుతుంది. అంతే కాదు.. సోషల్ మీడియాలో పడుతున్న వాటిని మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం కూడా చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడం లేదన్న ఆరోపణలు కూడా చేస్తున్నారు. అసంతృప్తిని కప్పి ఉంచితే అది ఎన్నికల సమయానికి బయటపడుతుందన్న భావన టీడీపీ అభిమానుల్లో వ్యక్తమవుతుంది. తాజాగా సత్యవేడు నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను ఆ పార్టీ కార్యకర్త నూతలపాటి హరిప్రసాద్ చౌదరి చేసిన పోస్టు వైరల్ గా మారింది. అతని పోస్టును చూసి చాలా మంది కార్యకర్తలు తమ నియోజకవర్గంలోనూ ఇంతేనని కామెంట్స్ పెడుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. సత్యవేడు ఎమ్మెల్యేగా ఆదిమూలం ఉన్నప్పటికీ అక్కడ హేమలత, గంగాప్రసాద్, నరసింహయాదవ్, మునస్వామియాదవ్, పద్మరాజు నాటి తిరుగుబాటు అభ్యర్థి చెరుకురసం రమేష్ బాబులు పార్టీలో పనిచేసిన వారికి అన్యాయం చేస్తున్నారని హరిప్రసాద్ చౌదరి ఆరోపించారు. పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా అధిష్టానం నిర్ణయించిన శంకర్ రెడ్డి టీడీపీ ఓటమి కోసం పనిచేసిన వారిని పక్కన కూర్చొని పెట్టుకొని వారికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీంతో పార్టీ కోసం నిజంగా కష్టపడ్డ నాయకుల్లో కష్టాలు అంతర్మధనం ప్రారంభమై తిరిగి గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయనిచెప్పారు. ఇదే పరిస్థితి అనేక నియోజకవర్గాల్లో నెలకొందని అనేక మంది సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# మార్చి 15 నుంచి టెస్ట్ ఎగ్జామ్స్



**తిరుపతి, నవంబర్ 21, పెన్ పవర్:** పదోతరగతి పరీక్షలను మార్చి 15 లేదా 21 నుంచి నిర్వహించడానికి విద్యాశాఖ సన్నద్ధమైంది. ఈసారి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. పూర్తి సాంకేతికత వాడుకొని ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించారు. పరీక్ష సెంటర్ నిర్ణయం నుంచి సిబ్బంది నియామకం వరకు అన్నింటినీ అమరావతి నుంచి చేపట్టనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇంటర్ ప్రాక్టికల్స్‌కు, పండగలతో పదోతరగతి విద్యార్థులకు ఎక్కడా ఇబ్బంది రాకుండా పరీక్షల షెడ్యూల్‌ను నిర్ణయించనున్నారు. అందుకే మార్చి 16 లేదా 21 తేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయి. 11 రోజుల పాటు జరిగే పరీక్షలకు ఆదివారం మినహా వేరే రోజు సెలవు రాకుండా ప్లాన్ చేస్తున్నారు.పదో తరగతి పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇవాళ రేపు విడుదల చేసే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. పరీక్షల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సాఫీగా టెన్షన్ లేకుండా పరీక్షలు రాసుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. సెంటర్‌కు సులభంగా చేరుకునేలా సాంకేతికతను వాడుకోనున్నారు. విద్యార్థులకు కేటాయించిన పరీక్ష సెంటర్ అడ్రెస్‌ను క్యూఆర్ కోడ్ ద్వారా హాల్‌టికెట్‌పై ముద్రిస్తారు. దీంతో సెంటర్‌కు ఈజీగా చేరుకొనేలా ప్లాన్ చేస్తున్నారు. పరీక్ష కేంద్రం ఎంపిక నుంచి సిబ్బంది నియామకం వరకు అన్నింటినీ ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖాధికారులు పర్యవేక్షించే వాళ్లు. ఇప్పుడు ప్రభుత్వ పరీక్షల డైరెక్ట్ విభాగం వీటిని పర్యవేక్షిస్తోంది. రాష్ట్ర స్థాయి నుంచే కేంద్రం, కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బందిని నియామకం చేపడతారు. పరీక్షలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న పాఠశాలలను ముగ్గురు ఉన్నతాధికారుల టీం పరిశీలిస్తుంది. అక్కడ ఉండే పరిస్థితులు, ఇతర సౌకర్యాలను తనిఖీ చేస్తుంది. అన్నీ అనుకూలంగా ఉంటే వారికి పరీక్ష కేంద్రం అనుమతి ఇస్తుంది. పదో తరగతి పరీక్షల టైంలోనే ఇంటర్ ప్రాక్టికల్స్ ఉన్నందున జూనియర్ కాలేజీలలో సెంటర్ ఇవ్వకూడదని నిర్ణయించారు. ఒక్క పరీక్ష కేంద్రాల ఎంపిక మాత్రమే కాకుండా పరీక్షలు సజావుగా సాగేందుకు సిబ్బంది నియామకం కూడా నేరుగా రాష్ట్ర స్థాయి నుంచే చేపడతారు. చీఫ్ సూపరింటెండెంట్లు, విభాగ అధికారులు, ఇన్విజిలేటర్లు అందర్నీ కూడా డీజీఈ కార్యాలయం నుంచే నియమిస్తారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఇతరుల వివరాలను ఆన్‌లైన్‌లో తీసుకుంటారు. వాటి ఆధారంగా నియామకాలు చేపడతారు. వాటిని ఆయ పాఠశాలలకు పంపిస్తారు. మరోవైపు తీసుకొని ఎంపిక చేసి, వాటి జాబితాలను జిల్లాలకు పంపనున్నారు.

# జనం ఉంటేనా బయిటకు వస్తారా...

**నెల్లూరు నవంబర్ 21, పెన్ పవర్:** ):జగన్మోహన్ రెడ్డి తన తీరు మార్చుకోవడం లేదు. తాను ఇంటి నుంచి బయటకు వస్తే జనం ఉండాల్సిందేనని చెబుతున్నారు. అది మృతుల కుటుంబాలకు పరామర్శకు వెళ్లినా.. లేకుంటే కోర్టు కేసులకు హాజరైనా.. బల ప్రదర్శన తప్పదు. చివరకు జైల్లో ఉన్న తమ వారిని పరామర్శించేందుకు వెళ్లినా అక్కడ జగన్ మామయ్య అంటూ గుక్క తిప్పుకునే ఏడ్చే సీన్లు ఉండాల్సిందే. ఎందుకంటే తాను ఎలివేట్ కాలేనన్న ఆందోళన జగన్మోహన్ రెడ్డిలో నిత్యం ఉంటుంది. అయితే తాజాగా ఆయన ఈరోజు హైదరాబాద్ వెళ్లారు. చాలా రోజులకు సిబిఐ కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఎక్కడికక్కడే జన సమీకరణ స్పష్టంగా కనిపించింది. చక్కటి చిరునవ్వుతో చేతులెత్తి నమస్కరిస్తూ వారిని ఉత్తేజపరిచారు జగన్మోహన్ రెడ్డి. తాను కోర్టుకు వెళుతున్నాం అన్న విషయం కూడా మరిచిపోయి చిరునవ్వుతో.. వెకిలి నవ్వుతో వారిని ఉత్తేజపరిచారు.ఎందుకో జగన్మోహన్ రెడ్డి జనాన్ని మరిచిపోలేకపోతున్నారు. జనం లేకపోతే తన నాయకత్వం మరింత బలహీనం అవుతుందని భావిస్తున్నారు. దానికి కారణాలు లేకపోలేదు. ఎందుకంటే జనం సెంటిమెంటు నుంచి పుట్టిందే ఆయన పార్టీ. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో,
అంతులేని సానుభూతి ఉన్న సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పునాదులు వేశారు జగన్మోహన్ రెడ్డి. అదే సెంటిమెంట్తో గోడలు కట్టారు. అడ్డగోలుగా స్లాబ్ కూడా వేశారు. ఇప్పుడు అందులో నిరంతరాయంగా నివాసం ఉండేందుకు అదే సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. అందులో భాగమే తాను ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టిన మరుక్షణం జనం కనిపించాలన్న తపన ఆయనది. కానీ జనం దానిని కోరుకోవడం లేదు. జనం ఆలోచన అంతా గడిబిడి వాతావరణం కాదు. చాలా పీస్ ఫుల్ గా ఆలోచిస్తున్నారు ఏపీ ప్రజలు. దానిని గుర్తించలేని స్థితిలో ఉన్నారు జగన్మోహన్ రెడ్డి.ఒక ప్రభుత్వం ఎలా నడపాలో జగన్మోహన్ రెడ్డిని చూసి నేర్చుకోవచ్చు. అయితే ఆయన గొప్పలా పాలించారు అని చెప్పడం లేదు కానీ. జగన్ లా పాలించకపోవడం అసలైన పాలన. ఇప్పుడు చంద్రబాబుచేస్తోంది అదే. జగన్మోహన్ రెడ్డి మాదిరిగా హడావిడి లేదు. బయటకు వెళితే జన సమీకరణ లేదు. కేవలం ఒక్కరే చంద్రబాబు వాహనంలో వెళ్తున్నారు. ఒకే ఒక్క గ్రామ ప్రజల మధ్య పథకాలను ప్రారంభిస్తున్నారు. పవన్ కళ్యాణ్ సైతం ఒంటరిగానే అడవికి వెళ్తున్నారు. రక్షణగా మందీ మార్బలం లేదు. ప్రభుత్వంలో ఉన్నామన్న దర్పం లేదు. అధికార పార్టీ వారు సింపుల్ గా ఉన్నారు. అధికారం నుంచి ప్రతిపక్షంలో మారిన వారు మాత్రం అదే దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈరోజు జగన్ హైదరాబాదులో అడుగుపెట్టిన మరుక్షణం భాగ్యనగరం ప్రజలకు చుక్కలు కనిపించాయి. అయితే జై కొట్టిన జనానికి ఇది కనిపించలేదు. జై కొట్టిన వారికి కనిపించలేదు. ఎటోచ్చి మిగతా ప్రజలే ఛీ కొడుతున్నారు.

# జగన్ కు బ్యాడ్ టైమేనా

**విజయవాడ, నవంబర్ 21, పెన్ పవర్:**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ పై నమోదయిన కేసుల విషయం చివరి దశకు చేరుకున్నట్లే కనిపిస్తుంది. ఇప్పుడు బీజేపీ కూడా జగన్ కు సాయం చేసే పరిస్థితుల్లో కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్ లో సొంతంగా అధికారంలో రాకపోయినా దానికి టీడీపీ, జనసేన అండగా ఉంది. అందుకే జగన్ ను నిర్ధాక్షిణ్యంగా పక్కన పెట్టే అవకాశాలున్నాయని అనేక మంది సీనియర్ రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. జగన్ వల్ల బీజేపీకి ప్రత్యక్షంగా ప్రయోజనం ఉండదు. అలాగని ఇప్పటి వరకూ నష్టం లేదు. పరోక్షంగా జగన్ తమకు అన్ని రకాలుగా సహకరిస్తున్నాడు. ఆ ఒక్క కారణంతోనే ఇన్నాళ్లు కేసుల విషయంలో చూసీ చూడనట్లు భారతీయ జనతా పార్టీ వ్యవహరించిందంటున్నారు. ఇప్పటి వరకూ ప్రధాని నరంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆశీస్సులు జగన్ కు పుష్కలంగా ఉన్నాయి. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఏపీకి ఇన్ని సార్లు వచ్చినా జగన్ ను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. జగన కూడా రాష్ట్రంలో తన ప్రత్యర్థి పార్టీలు బీజేపీతో జత కట్టినా బీజేపీని ఒక్క మాట అనడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వానికి ఏం అవసరమొచ్చినా కమలం పక్కనే నిలబడుతున్నారు. కాంగ్రెస్ తనకు ప్రధాన శత్రువు కావడంతో బీజేపీకి మద్దతు ఇస్తుండవచ్చు. అందుకే ఏ బిల్లు విషయంలోనైనా,రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనైనా జగన్ నేరుగానే మద్దతిచ్చి మోదీ కి ఇష్టమైన వ్యక్తిగా మారాడు. అలాగే బీజేపీ విషయంలో ఒక్క విమర్శ కూడా చేయకుండా జాగ్రత్త పడుతున్నారు. కానీ బీజేపీ తన వైఖరి మార్చుకోవడానికి అనేక కారణాలుంటాయి.



బీజేపీకి కూడా దక్షిణాదిన అందులో ఆంధ్రప్రదేశ్ లో తమ బలం పెంచుకోవడం అవసరం. అది జగన్ వల్ల సాధ్యం కాదు. కూటమితో ఉంటే సీట్ల సంఖ్య పెంచుకోవచ్చు. అధికారంలో ఒక రాష్ట్రంలో ఉన్నామన్న సంతృప్తి పొందవచ్చు. కానీ జగన్ వల్ల రాజకీయ ప్రయోజనం కొన్నింటికే పరిమిమై ఉంటుంది. ఈ విషయం గ్రహించిన బీజేపీ తన పంథాను మార్చుకోవచ్చన్న సూచనలు బలంగా అందుతున్నాయి. తమకు జగన్ కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యమని భావిస్తే జగన్ కు రానున్న కాలంలో కష్టాలు తప్పవన్న సంకేతాలు ఇప్పటికే వస్తున్నాయి. జగన్ నేడు సీబీఐ కోర్టుకు కొన్నేళ్ల తర్వాత హాజరవ్వడాన్ని కూడా ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుంది. అందుకే జగన్ కు రానున్నకాలం కష్టకాలమేనని ఖచ్చితంగా చెప్పొచ్చు.

# బోర్డర్స్ లో అడగడుగునా నిఘా

**విజయనగరం, నవంబర్ 21, పెన్ పవర్:**
.ఆంధ్రా-ఒడిశా బోర్డర్.. షార్ట్‌కట్‌లో ఏవోబీ. ఈ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు..గత చరిత్ర అని ఇంతవరకూ భావించారు ఏపీ పోలీసులు. అయితే వరుసగా రెండు రోజులు జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లు.. పోలీసుల ఆలోచనను మార్చేశాయి. దీంతో ఏవోబీలో ఇకపై నో మోర్ గేమ్స్ అంటూ వేట మొదలుపెట్టారు.వరుస ఎన్‌కౌంటర్లు.. మావోయిస్ట్ అగ్రనేతల కదలికలతో %ఖూదీ%లో మళ్లీ హైటెన్షన్ మొదలయింది. రెండు రోజుల పాటు జరిగిన ఎదురు కాల్పుల్లో మోస్ట్ వాంటెడ్ హిడ్మా సహా ఆరుగురు మవోయిస్టులు హతం కాగా.. మరునాడు బుధవారం ఉదయం జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో టెక్ శంకర్‌తో పాటు మరో ఆరుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఏపీలోని వివిధ జిల్లాల్లో తలదాచుకున్న మరో 50 మంది మావోయిస్టులు పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో ఏపీలో మళ్లీ హైటెన్షన్ మొదలయింది. ఏవోబీని షెల్టర్‌జోన్‌గా మార్చుకోవడానికి
మావోయిస్టులప్రయత్నిస్తున్నారని..అందుకోసం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిని రిక్రూట్‌మెంట్ చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు ఏపీలోకి తరలిరావడంతో పోలీసుల నిఘా ఒక్కసారిగా పెరిగింది. ఏవోబీతోపాటు తూర్పు గోదావరి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతాల్లో భారీగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో



రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లోనూ మావోయిస్టులు ఉన్నారేమోనన్న అనుమానంతో హైఅలర్ట్ ప్రకటించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఏపీవైపు మావోయిస్టులు చొరబడకుండా పటిష్ట నిఘా వేసినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు.2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయాలన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాలతో 2024 జనవరి నుంచి దండకారణ్యంలో 'ఆపరేషన్ కగార్' మొదలైంది. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. 2014లో 126 జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం ఉండగా.. 2024 నాటికి 38 జిల్లాలకు తగ్గిపోయింది. ఆ తర్వాత ఏడాదిన్నర వ్యవధిలోనే చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్, నారాయణపూర్, సుక్మా, జార?ండ్‌లోని వెస్ట్‌సింగ్ భూమ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలకు మాత్రమే మావోయిస్టు పార్టీ పరిమితమైంది. దీంతో ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్న మావోయిస్టులు.. సేఫ్‌జోన్ కోసం పట్టణాలు, నగరాల బాట పట్టారు. ఈ క్రమంలో అలెర్ట్ అయిన ఏపీ పోలీసులు.. మావోయిస్టులకు బోర్డర్‌లోనే నోఎంట్రీ బోర్డు పెడుతున్నారు

# క్షేత్రస్థాయి సంగతేంటీ... పవన్

**విజయవాడ, నవంబర్ 21, పెన్ పవర్:**
జనసేన పార్టీ సంస్థాగతంగా ఆంధ్రప్రదేశ్ లో బలంగా లేదు. పవన్ కల్యాణ్ క్రేజ్.. ఇమేజ్ మీదనే అది ఆధారపడి ఉంది. అయితే మొన్నటి వరకూ ఒక ఎత్తు. పవన్ కల్యాణ్ ను పవర్ లో ఎవరూ చూడలేదు. అధికారంలో లేనప్పుడు ఉండే క్రేజ్ కంటే అధికారంలో ఉన్నప్పుడు ఉండే ఇమేజ్ కు చాలా తేడా ఉంటుంది. మైండ్ సెట్ లోనూ నాయకుల్లో మార్పు వస్తుంది. అధికారంలోకి రాకముందు ప్రశ్నించడానికే వచ్చామంటారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించడమే మానేస్తారు.క్షేత్ర స్థాయిలో ఉన్న ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకుంటేనే పార్టీ మనుగడ సాధ్యమవుతుంది. ఈ విషయం అనేక రాష్ట్రాల్లో అనేక మంది విషయాల్లో వెల్లడయిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.ఉపముఖ్యమంత్రిగా మాత్రం... జనసేన అధినేతగా పవన్ కల్యాణ్ నిజాయితీ పరుడే.ప్రశ్నించే తత్వం ఉన్న నాయకుడే. కానీ ఉప ముఖ్యమంత్రిగా ఆయన నోరు విప్పితే



ప్రతిపక్షంపైనే విరుచుకుపడుతున్నారని, అధికార పార్టీ నేతల అరాచకాలను ప్రశ్నించలేకపోతున్నారన్న ఆవేదన, ఆక్రోశం క్యాడర్ లోనూ, కాపు సామాజికవర్గంలోనూ ఉంది. అనేక విషయాల్లో పవన్ కల్యాణ్ మౌనంగా ఉండటం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో జనసేన నేతలను, క్యాడర్ ను ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోకపోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. తాము కష్టపడి పనిచేసిన దానికి ఫలితం లేకుండా పోయిందన్న ఆవేదన, నిరాశ, నిస్పృహలు పార్టీ ముఖ్య కార్యకర్తల్లోనూ, పవన్ వీరాభిమానుల్లోనూ వ్యక్తమవుతున్నాయి.కూటమి పార్టీలు కలసి ఉంటే గెలుస్తామని బిందాస్ గా కూర్చోవడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. గత ఎన్నికల్లో అందరం కలసి పనిచేస్తేనే హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ వచ్చిందని, ఇప్పుడు వందకు పైగా నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన పనిచేసే పరిస్థితులు లేవన్నది పవన్ కల్యాణ్ గుర్తిస్తే మంచిదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు జరిగి రెండేళ్లు కాకముందే ఈ పరిస్థితి ఉంటే రాను రాను ఇది మరింత పెరుగుతుందని, అది పార్టీకి నష్టం చేకూరుతుందని కొందరు పార్టీ అభిమానులు సోషల్ మీడియా వేదిక ద్వారా వార్నింగ్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పటికైనా నియోజకవర్గాల్లో క్యాడర్, నేతల విషయంలో సీరియస్ యాక్షన్ కు దిగాల్సిందేనని పట్టుబడుతున్నారు. మరి ఏం జరుగుతందో చూడాలి.

# వ్యక్తిగతంగా తీసుకుంటున్న నేతలు

**కరీంనగర్, నవంబర్ 21, పెన్ పవర్:**
ఒకప్పుడు రాజకీయాలు హుందాగా ఉండేవి. నేతల మధ్య సంబంధాలు కూడా అదే స్థాయిలో ఉండేవి. రాజకీయాలలో వ్యక్తిగత కక్షలకు ఆస్కారం ఉండేది కాదు. పైగా నేతలు రాజకీయాలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కొనసాగించేవారు. మిగతా సందర్భాలలో మానవ సంబంధాలను పెంపొందించుకోవడానికి ఇష్టపడేవారు.ఇప్పటి కాలంలో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. రాజకీయాలను వ్యక్తిగత అంశంగా మార్చుకోవడం వల్ల నేతల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గు మంటున్నది. వ్యక్తిగత అంశాలను కూడా రాజకీయ నాయకులు వివిధ వేదికల వద్ద ప్రస్తావించడం.. కుటుంబ సభ్యుల వ్యవహారాలను కూడా బయటపెడుతుండడంతో రాజకీయాలు అంటేనే ఇబ్బందికరంగా మారిపోయాయి. నేతల భాష కూడా అత్యంత దారుణంగా ఉంటున్నది. ఇవన్నీ కూడా నేటి రాజకీయాలలో పతనమవుతున్న విలువలకు దర్పణంగా నిలుస్తున్నాయి. ఇలాంటి రాజకీయాలు ఇంకా ఎంతకాలం కొనసాగుతాయి.. ఇవన్నీ ఎక్కడ వరకు దారి తీస్తాయి అనే ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు.తెలంగాణ రాజకీయాలలో ప్రస్తుతం కేటీఆర్ రేవంత్ రెడ్డి మధ్య విపరీతమైన పోటీ నెలకొంది. ఇద్దరు నేతలు నువ్వా నేనా అన్నట్టుగా విమర్శలు చేసుకుంటున్నారు. ఇటీవలి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రేవంత్ ను కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శిస్తే.. దానికి రెట్టింపు స్థాయిలో రేవంత్ కేటీఆర్ ను విమర్శించారు. అంతేకాదు రేవంత్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లలో ప్రధానంగా దృష్టి సారించారు. అక్కడ భూ అక్రమాలను బయటకు తీశారు. అయితే ప్రభుత్వం నియమించిన ఒక కలెక్టర్ వివాదాస్పదంగా వ్యవహరించడంతో రేవంత్ కాస్త ఇబ్బంది పడాల్సి వచ్చింది. చివరికి ఇటీవల ఓ మహిళ ఐఏఎస్ ను సిరిసిల్ల కలెక్టర్ గా నియమించారు. సిరిసిల్ల జిల్లాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ఇందులో రేవంత్ రెడ్డి ప్రమేయం ఉండడంతో అది కాస్త చర్చకు దారి తీసింది.. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందిరమ్మ చీరలను మహిళా సంఘాలకు పంపిణీ చేసే విషయంపై ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ నేపథ్యంలో సిరిసిల్ల కలెక్టర్ కూడా మాట్లాడారు. అయితే ఆమె ఇంగ్లీష్ లో మాట్లాడుతుండగా రేవంత్ రెడ్డి కల్పించుకున్నారు.

# సౌతాఫ్రికాతో సెకండ్ టెస్ట్.. గిల్ ఔట్..
# పంత్ చేతికి కెప్టెన్సీ పగ్గాలు

**సౌతాఫ్రికాతో కీలకమైన రెండో టెస్టుకు ముందు అభిమానులకు టీమిండియా చేదు వార్త చెప్పింది. తొలి టెస్టులో మెడ కండరాల నొప్పితో బాధపడిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్, డాక్టర్ల సూచన మేరకు ఈ మ్యాచ్?కు దూరమయ్యాడు. మ్యాచ్ సమయంలో మళ్లీ నొప్పి తిరగబెట్టే ప్రమాదం ఉన్నందున అతడిని ఆడించి రిస్క్ చేయకూడదని జట్టు మేనేజ్?మెంట్ నిర్ణయించింది. స్క్వాడ్ నుంచి తప్పించింది. సెకండ్ టెస్ట్ కెప్టెన్సీ పగ్గాలను రిషబ్ పంత్?కు అప్పగించింది. సౌతాఫ్రికాతో సెకండ్ టెస్ట్ శనివారం నుంచి మొదలు కానుంది. గిల్ ఆడే అవకాశం లేదని బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్ టీమ్ శుక్రవారం ప్రకటించింది.**




**హైదరాబాద్ పెన్ పవర్:** రిషబ్ పంత్ ఇండియా 38వ టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ కీలక మార్పుతో పాటు తుది జట్టులో రెండు ముఖ్యమైన స్థానాలపై టీమ్ మేనేజ్‌మెంట్ తీవ్రంగా కసరత్తు మొదలుపెట్టింది. గిల్ స్థానంలో రిజర్వ్ బెంచ్‌లోని లెఫ్టాండ్ బ్యాటర్లలో సాయి సుదర్శన్ వైపు మొగ్గు చూపుతుండటం గమనార్హం. తొలి టెస్ట్‌లో మూడో నంబర్‌లో మెరుగ్గా ఆడిన వాషింగ్టన్ సుందర్‌ను కొనసాగించి, సుదర్శన్‌ను ఆరో నంబర్‌లో బ్యాటింగ్‌కు పంపే అవకాశం ఉంది.మరొక కీలక స్థానం స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, సీమ్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి మధ్య పోటీగా మారింది. అక్షర్ పటేల్ మెరుగైన బ్యాటింగ్ చేయగలడు. కానీ పిచ్‌పై పచ్చిక ఉండి బౌన్స్?కు అనుకూలిస్తే రైట్ హ్యాండ్ బ్యాటర్ నితీష్ రెడ్డికి సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా అవకాశం దక్కే చాన్స్ ఉంది. ఐదో బౌలర్‌గా నితీష్ రెడ్డి వస్తే పేస్ బౌలింగ్‌కు సపోర్ట్ లభించడంతో పాటు రైట్ హ్యాండ్ బ్యాటర్ల సంఖ్య కూడా పెరుగుతుందని టీమ్ మేనేజ్‌మెంట్ లెక్కలు వేస్తోంది. ఏదేమైనా తొలి టెస్ట్ ఓటమి తర్వాత సరైన కాంబినేషన్?ను ఎంచుకుని సిరీస్ సమం చేయడానికి ఇండియా వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది.

# స్మృతి మంధాన పెండ్లి.. వరుడి బ్యాక్ గ్రౌండ్ తక్కువ లేదుగా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా విమెన్స్ క్రికెట్ టీమ్ వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పెండ్లి పీటలు ఎక్కనుంది. తాను చాన్నాళ్లుగా ప్రేమిస్తున్న మ్యూజిక్ కంపోజర్, సింగర్ పలాష్ ముచ్చల్‌ను పెండ్లి చేసుకోనుంది. ఈ నెల 23న ఈ ఇద్దరి మ్యారేజ్ జరగనుంది. మహారాష్ట్రలోని సాంగ్లీలో జరిగే ఈ గ్రాండ్ వెడ్డింగ్‌కు సినీ, క్రికెటర్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలుస్తోంది.

**రాజకీయ పుస్తకాలు**

ఇరు కుటుంబాలు పెండ్లికి సంబంధించిన ఏర్పాట్లలో మునిగిపోయాయి. నెల కిందటే ఇండోర్‌లో ఈ ఇద్దరి ఎంగేజ్‌మెంట్ జర్గగా.. ఈ విషయాన్ని స్మృతి ఇన్‌స్టా పోస్టులో ఇటీవలే వెల్లడించింది. స్మృతి – పలాష్ వెడ్డింగ్ కార్డు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# నేటి నుంచి టీమిండియాతో రెండో టెస్టు... దక్షిణాఫ్రికాకు గట్టి ఎదురుదెబ్బ

- **భారత పర్యటన మొత్తానికి దూరమైన కగిసో రబాడా**
- **పక్కటెముకల గాయంతో సిరీస్ నుంచి నిష్క్రమణ**
- **రబాడా స్థానంలో జట్టులోకి వచ్చిన లుంగి ఎంగిడి**
- **రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న సౌతాఫ్రికా**
- **నేటి నుంచి రెండో టెస్టు**
- **భారత్‌లో చివరిసారిగా 2000 సంవత్సరంలో సిరీస్ గెలిచిన సఫారీలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఇప్పటికే 1–0 ఆధిక్యంలో ఉన్న దక్షిణాఫ్రికా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడా గాయం కారణంగా రెండో టెస్టుకు కూడా దూరమయ్యాడు. పక్కటెముకల ఒత్తిడి గాయంతో బాధపడుతున్న అతడు.. గౌహతిలో జరిగే రెండో టెస్టుతో పాటు, ఆ తర్వాత జరగబోయే వైట్–బాల్ సిరీస్‌కు కూడా అందుబాటులో ఉండడని క్రికెట్ సౌతాఫ్రికా ప్రకటించింది.

కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టుకు కూడా రబాడా దూరమైన సంగతి తెలిసిందే. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడం, నొప్పి ఇంకా కొనసాగుతుండటంతో అతడిని సిరీస్ నుంచి తప్పిస్తున్నట్లు సీఎస్ఏ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. రబాడా స్థానంలో ఇప్పటికే లుంగి ఎంగిడిని జట్టులోకి తీసుకున్నారు. రబాడా నాలుగు వారాల పాటు వైద్య పర్యవేక్షణలో ఉంటాడని, రెండో టెస్ట్ ముగిసిన తర్వాత దక్షిణాఫ్రికాకు తిరిగి వెళతాడని సీఎస్ఏ వివరించింది.

రబాడా గైర్హాజరీతో గౌహతి టెస్టులో సౌతాఫ్రికా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. కోల్‌కతా టెస్టులో మొత్తం 8 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన స్పిన్నర్ సైమన్ హార్మర్ సఫారీ బౌలింగ్‌కు నాయకత్వం వహించాడు. అతడికి మరో స్పిన్నర్ కేశవ్ మహారాజ్‌తో పాటు, పేస్ ఆల్‌రౌండర్లు మార్కో యన్‌సెన్, వియాన్ ముల్డర్, కార్బిన్ బాష్ సహకారం అందించారు.గౌహతి టెస్టులో గెలిచి 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలవాలని టెంబా బవుమా సేన పట్టుదలగా ఉంది. చివరిసారిగా 2000వ సంవత్సరంలో హన్సీ క్రోన్యే కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు భారత్‌లో టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది.



మస్తీ 4 ప్రీమియర్ కోసం రెడ్ కార్పెట్ లుక్‌లో ఎల్నాజ్ నోరౌజీ స్టన్స్

# కపూర్ బ్యూటీ మళ్లీ సర్‌ప్రైజ్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనమ్ కపూర్ మరోసారి అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. 2018లో వ్యాపారవేత్త ఆనంద్ ఆహుజాను వివాహం చేసుకున్న సోనమ్ కపూర్ 2022లో మొదటి సారి తల్లి అయింది. ఆ సమయంలోనూ తాను తల్లి కాబోతున్నాను అంటూ సర్‌ప్రైజింగ్ ఫోటోలు షేర్ చేసింది. బేబీ బంప్‌తో సోనమ్ కపూర్ షేర్ చేసిన ఫోటోలు ఆ సమయంలో చర్చనీయాంశం అయ్యాయి. స్టార్ హీరోయిన్ తల్లి కాబోతుంది అంటూ తెగ ప్రచారం జరిగింది. మొదటి సారి బాబుకు జన్మనిచ్చిన సోనమ్ కపూర్ దంపతులు అతడికి వాయు అని పేరు పెట్టారు. వాయు ఇప్పుడు మూడు ఏళ్ల వయసు పిల్లాడు. ఇంతలోనే అతడు అన్న కాబోతున్నాడు అంటూ అధికారికంగా ప్రకటన వచ్చింది. వాయు అన్న కాబోతున్నట్లుగా అధికారికంగా సోనమ్ కపూర్ ఫోటోలు షేర్ చేసి మరీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

**బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రెగ్నెంట్...**

సోనమ్ కపూర్ పింక్ కలర్ డ్రెస్‌లో బేబీ బంప్‌తో ఉన్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగానే సెలబ్రిటీల యొక్క ప్రగ్నెన్సీ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. కానీ సోనమ్ కపూర్ యొక్క సెకండ్ ప్రెగ్నెన్సీ పెద్దగా చర్చ జరగలేదు. సోషల్ మీడియాలోనూ ఆమె ప్రెగ్నెన్సీ గురించి ప్రచారం జరగలేదు. దాంతో అసలు విషయం ఏంటో అనేది క్లారిటీ లేదు. ఇప్పుడు నెసోనమ్ కపూర్ నుంచి క్లారిటీ వచ్చింది. ఆమె బేబీ బంప్ తో ఫోటో షూట్ ఇచ్చింది. దాంతో ఒక్కసారిగా అంతా సర్‌ప్రైజ్ అయ్యారు. సాధారణంగా అయితే సోషల్ మీడియాలో ప్రచారం జరిగి ఆ తర్వాత విషయాన్ని కన్ఫర్మ్ చేస్తారు. కానీ సోనమ్ కపూర్ సెకండ్ ప్రెగ్నెన్సీ విషయం గురించి వార్తలు రాకపోవడంతో ఇప్పుడు అంతా సర్‌ప్రైజ్ అవుతున్నారు అనేది సోషల్ మీడియా కామెంట్స్‌ను చూస్తే అర్థం అవుతుంది.

**సోనమ్ కపూర్ హీరోయిన్‌గా**

హీరోయిన్‌గా సోనమ్ కపూర్ సినిమాలు గతంతో పోల్చితే తగ్గించింది. 2019 సంవత్సరం వరకు వరుస సినిమాలు చేసిన సోనమ్ కపూర్ పెళ్లి తర్వాత తగ్గించింది అనేది అభిమానుల కంప్లైంట్. హీరోయిన్‌గా సోనమ్ కపూర్ వరుస సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. కానీ ఆమె నుంచి మాత్రం సినిమాలు అంతగా రావడం



లేదు. 2023 లో బ్లైండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. అయినా కూడా నటిగా మంచి మార్కులు తెచ్చి పెట్టింది. ఆ వెంటనే ఒకటి రెండు సినిమా ఆఫర్లు వచ్చాయట. కానీ ఆమె మాత్రం సున్నితంగా తిరస్కరించిందని సమాచారం. రెండో ప్రెగ్నెన్సీ కారణంగా సోనమ్ కపూర్ సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చింది. త్వరలోనే ఆమె రెండో బేబీకి జన్మనిచ్చిన తర్వాత సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

**అనిల్ కపూర్ కుమార్తె సోనమ్ కపూర్**

బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో అనిల్ కపూర్ కుమార్తె అయిన సోనమ్ కపూర్ మొదట్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసింది.

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన సావరియా సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. 2007 సంవత్సరంలో ఆ సినిమా విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దాంతో సోనమ్ కపూర్ వెనక్కి తిరిగి చూసుకోనవసరం రాలేదు. బాలీవుడ్‌లో దాదాపు అందరు స్టార్ హీరోలకు జోడీగా నటించడం ద్వారా స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. ఎన్నో అవార్డులు, రికార్డ్‌లను సొంతం చేసుకున్న హీరోయిన్‌గానూ సోనమ్ కపూర్ నిలిచింది. ఆకట్టుకునే అందంతో పాటు, నటిగానూ సోనమ్ కపూర్ తన సినిమాలతో మెప్పించడం జరుగుతుంది. అందుకే ఈమె సినిమాలను అభిమానించే వారు చాలా మంది ఉంటారు. సెకండ్ ప్రెగ్నెన్సీ తర్వాత సోనమ్ మళ్లీ బిజీ కావాలని అంతా కోరుకుంటున్నారు. మరి ఆమె ఉద్దేశం ఏంటో చూడాలి.



లారిస్సా బోనేసి సొగసైన టీల్ గౌన్‌తో తల తిప్పింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965